



గోకవరం ఆసుపత్రిలో జ్వరపీడితులు

ఇసుక రవాణాకు 134 వాహనాలు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 24 : జిల్లాలో ఇసుక రవాణాకు డిటీసీ ద్వారా 134 వాహనాలకు అనుమతి ఇచ్చినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం రాజమహేంద్రవరం, కొవ్వూరు ఆర్డీవోలు, మైన్స్, ఇరిగేషన్ తదితర అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉచిత ఇసుక రవాణాలో అధిక చార్జీలు వసూళ్లను నియంత్రించాలన్నారు. జిల్లాలో ఇసుక రవాణా చేసే వాహనాలను గుర్తించి ధ్రువీకరించే అధికారం జిల్లా రవాణా అధికారులదే అన్నారు. వారి ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలను అనుమతించడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటి వరకు 134 లారీలు జిల్లాలో వాటి వివరాలు నమోదు చేసుకున్నట్టు తెలిపారు.రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటి జాబితా, ఆయా వాహనాల నుంచి వసూలు చేయాల్సిన రవాణా చార్జీలు నిర్ధారించిన ధరల పట్టిక ఇచ్చామన్నారు. ఇతర జిల్లాల నుంచి వస్తున్న వాహనాల జాబితా ఆధారంగా వాటిని అనుమతించడం,ఆ మేరకు రవాణా చార్జీలు చెల్లింపులు సేకరించాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ కూడా వారి ఐచ్ఛికత మేరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాల నుంచి జిల్లాలో నిర్ధేశించిన రవాణా చార్జీలను అనుసరించాల్సి ఉంటుందన్నారు.




కెనాల్‌లో బోట్ షికార్ ఏర్పాటుపై కడియపులంక వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పర్యాటక ప్రతిపాదనలు సిద్ధం చేయండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

కడియం, ఆగస్టు 24: జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధి ప్రణాళికలో భాగంగా పొట్టిలంక నుంచి కడియపులంక వరకు కెనాల్‌లో బోట్ విహారం చేసే విధానంలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. పర్యాటక శాఖ అధికారులతో కలిసి కడియం మండలంలో శనివారం కలెక్టర్ ప్రశాంతి పర్యటించారు. కలెక్టర్ ప్రశాంతి , జిల్లా పర్యాటక శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ తగిన ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ఇటీవల ఎకో టూరిజంపై మంత్రి కందుల దుర్గేష్, కడియం నర్సరీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారన్నారు. పొట్టిలంక నుంచి కడియపులంక వరకు బోటింగ్‌కు అనుగుణంగా ప్రతిపాదనలను, డీపీఆర్‌ను సిద్ధం చేయాలన్నారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు ముందుగానే ఈ ప్రాంతంలో పర్యాటకంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాల్సి ఉందన్నారు.కార్యక్రమంలో పర్యాటకశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వి.స్వామినాయుడు, జిల్లా టూరిజం అధికారి పి.వెంకటాచలం, తహశీల్దార్ కె.పోశిబాబు, ఎంపీడీవో కె.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

జ్వరమొచ్చింది!



జిల్లాను పీడిస్తున్న ఫీవర్లు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24 : జిల్లాకు జ్వరమొచ్చింది.ఎక్కడ చూసినా జ్వరపీడితులే. పిల్లలు,పెద్దలు అందరూ జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామాల్లో అనేక కుటుంబాల్లో ఇద్దరు, ముగ్గురు జ్వరాల బారి నపడుతున్నారు. వర్షాకాలం,వాతావరణంలో భిన్నమైన పరిస్థితులు నెలకొనడంతో జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. డెంగీ జ్వరాలు ప్రజలను పీడిస్తున్నాయి.బాధితులకు ప్లేట్‌లెట్లు సడన్‌గా పడిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది.మరోపక్క సీజనల్ వైరల్ ఫీవర్లు ప్రజలపై దాడి చేస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియాతో పాటు సాధారణ ఫ్లూ, ఇన్‌ఫ్లుయెంజా కూడా విజృంభిస్తున్నాయి. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం తల్లడిల్లిపోతున్నారు. జలుబు, గొంతులో కఫం, విపరీతమైన తలనొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వరం వంటి లక్షణాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రెండు, మూడు రోజులు కాదు ఏకంగా వారం, పది రోజుల పాటు ఇవే లక్షణాలు కనిపిస్తుండడంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో వైద్యం కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు జ్వరపీడితులు క్యూ కడుతున్నారు. ఆసుపత్రుల వద్ద బారులు తీరుతున్నారు. కేవలం జ్వరం నుంచి బయటపడటానికి మందులు, టెస్టులకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.జిల్లాలో ప్రధాన ఆసుప త్రులతో పాటు పీహెచ్‌సీలు,అర్బన్ హెల్త్ సెంటర్లలో కూడా ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. చాలా మంది గ్రామస్థులు ఆర్‌ఎంపీ, పీఎంపీలతో వైద్యం చేయించుకుంటున్నారు. కొంతమంది మెడికల్ షాపుల వద్దే మందులు తెచ్చుకుని వాడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రికి వెళితే సుమారు రూ.5 వేలు ఉండాల్సిందే. దీంతో సామాన్యులు అటువైపు చూసే ధైర్యం చేయడంలేదు. జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకూ 28 డెంగీ కేసులు నమోదయ్యాయి. మలేరియా కేసు ఒకటే నమోదైందని చెబుతున్నారు. వాస్తవంగా చాలా చోట్ల ఇటు వంటి కేసులు నమోదవుతున్నాయి. నల్లజర్ల మండలం పోతవరంలో ఇటీవల రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి.

కొవ్వూరులో జ్వరాల విజృంభణ

కొవ్వూరు, ఆగస్టు 22: వర్షాకాలం కావడంతో కొవ్వూరు పట్టణం, పరిసర గ్రామాల్లో గత 20 రోజులుగా సీజనల్ వ్యాధుల వ్యాప్తి పెరిగింది. అపారిశుధ్యం, వాతావరణ పరిస్థితుల కారణంగా టైఫాయిడ్, మలేరియా, డెంగీ కేసులు ప్రబలడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి ప్రతి రోజు 200 మందికిపైగా జ్వర బాధితులు వస్తున్నారని ఆసుపత్రి లెక్కలు చెబుతున్నాయి. సుమారు 75 నుంచి 100 మందికి ప్రతిరోజు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తపరీక్షలు చేస్తున్నారు. ఇక్కడే కాకుండా పీహెచ్‌సీలు, ఆర్‌ఎంపీలు, ప్రైవేటు ఆసుపత్రుల్లో వందలాది మంది జ్వరాలతో చికిత్స పొందుతున్నారు. దోమల నివారణ చర్యలతో పాటు దోమ తెరలు వాడాలని వైద్యులు సూచిస్తున్నారు.

గోపాలపురాన జ్వరపీడితులు..

గోపాలపురం, ఆగస్టు 24 : గ్రామగ్రామాన జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. అయితే పేదలకు ఆ స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. నియోజకవర్గ ముఖ్య కేంద్రంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం స్థాయిని పెంచినప్పటికీ పడకలను ఆ స్థాయిలో పెంచకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పూర్వం ఆరు పడకలకే పరిమితమై ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న గోపాలపురం ప్రభుత్వాసుపత్రి 2017లో నాటి సీఎం నారా చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌గా నామకరణం చేసి 30 పడకలకు పెంచారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ఇదే ప్రధాన ఆసుపత్రి.. గత ప్రభుత్వం ఆసుపత్రిని పట్టించుకోకపోవడంతో వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. నియోజకవర్గ పరిధిలో ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నా అక్కడా సేవలు అంతంతమాత్రమే. గోపాలపురం నియోజకవర్గ ప్రజలకు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోగులతో ఆసుపత్రులు కిటకిట..

రాజానగరం/దివాన్‌చెరువు/కడియం,ఆగస్టు 24 : రాజానగరం మండలంలో కూడా జ్వరపీడితుల సంఖ్య పెరిగింది. ఆసుపత్రులన్నీ రోగులతో నిండిపోతున్నాయి.రాజా నగరం పీహెచ్‌సీలో రోజుకు 60-80 వరకు రోగులు వస్తు న్నారు. వారిలో జ్వర పీడితులే ఎక్కువ. పాలచర్ల పీహెచ్‌సీలో ఆసుపత్రికి వచ్చే అవుట్ పేషెంట్లలో దాదాపు నగం మంది దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, జ్వరం వంటి లక్షణాలతో బాధ పడుతున్నారు. మరికొంత మందికి కీళ్ల నొప్పులు వస్తున్నాయి. కడియం మండలంలోనూ జ్వరాలతో వందలాది మంది బాధపడుతున్నారు.ఒక్క కడియం పీహెచ్‌సీలోనే రోకు సుమారు 50 కేసులు నమోదవుతున్నాయి. ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో, ఆర్‌ఎంపీల వద్ద వైద్యం పొందుతున్న వారూ ఎక్కువే.

అనపర్తి ఆసుపత్రికి రోజూ 50 మంది..

అనపర్తి, ఆగస్టు 22: అనపర్తి ఏరియా ఆసుపత్రికి ప్రతి రోజు సుమారు 50 మంది వరకు జ్వర పీడితులే వస్తున్నారు. ఏరియా ఆసుపత్రిలో నగం పైగా జ్వరాలతో చికిత్స పొందుతున్న రోగులే కనిపిస్తున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డిని ప్రశ్నించగా ఈ ఏడాది జ్వర పీడితుల సంఖ్య పెరగడం వాస్తవమేనని వాతావరణ పరిస్థితుల ప్రభావంతో జ్వరాల తీవ్రత పెరిగిందన్నారు. ఆసుపత్రిలో జ్వర పీడితులకు అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని, జ్వర పీడితులు రెండు మూడు రోజుల్లో కోలుకుంటున్నారన్నారు.రోజుకు సుమారు 30 నుంచి 40 మంది వరకు కొత్త పేషెంట్లు వస్తున్నారని తెలిపారు.

డెంగీతో ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ



ఆసుపత్రిలో జ్వరపీడితులు

డెంగీ జ్వరాలతో బాధపడుతున్న వారిలో ఎక్కువ మంది ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. డెంగీలో ప్రధానంగా ప్లేట్‌లెట్ కౌంట్ పర్యవేక్షణ అత్యంత కీలకం..దీంతో బాధితులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లిపోతున్నారు. ప్రైవేటు వైద్యులు ఇదే అదునుగా వేలు.. లక్షలు లాగేస్తున్నారు. జ్వరం ఉందని వెళితే రూ.5 వేల వరకూ ఖర్చవుతుందని బాధితులు వాపోతున్నారు. వైరల్ ఫీవర్లతో పాటు టైఫాయిడ్, మలేరియా లక్షణాలతోనూ ఆసుపత్రులకు వస్తున్నవారి సంఖ్య ఎక్కువగానే ఉందని చెబుతున్నారు. ఇటీవల కొద్దిరోజులుగా వాతావరణంలో విపరీతమైన మార్పులు కనిపిస్తున్నాయి. ఎండలు, ఉక్కపోత అంతలోనే వర్షం కురవడం వంటి భిన్నమైన వాతావరణం వైరల్ ఫీవర్లు, ఇతర జ్వరాలకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. అలాగే, కలుషిత నీరు టైఫాయిడ్ వంటి జ్వరాలకు మూలంగా పేర్కొంటున్నారు.

జీజీహెచ్ వైద్యులకు పట్టదా!

జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, పల్లెలు అనే తేడాలేకుండా వైరల్ ఫీవర్లు, డెంగీ జ్వరాలు ప్రజలను పట్టి పీడిస్తుంటే రాజమహేంద్రవరం జీజీహెచ్ వైద్యాధికారులు మాత్రం అబ్బే పెద్దగా జ్వరాలేమీ లేవని చెప్పడం విమర్శలకు దారితీస్తోంది. ఒక పక్క ప్రైవేట్ ఆసుపత్రులు, ఆర్‌ఎంపీ క్లినిక్‌ల్లో ఫీవర్ బాధితులతో కిటకిటలాడుతుంటే ఇక్కడి పెద్దాసుపత్రి వైద్యులు మాత్రం జ్వరపీడితుల వివరాలు చూపించడంలో అయోమయం ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది. వైరల్, డెంగీ వంటి జ్వరాలతో బాధితులు ప్రైవేట్ ఆసుపత్రులకు పోటెత్తుతున్నా జిల్లా సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో మాత్రం జ్వరపీడితులకు సంబంధించి జనరల్ మెడిసిన్ వైద్య విభాగం ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడం ప్రశ్నార్థకంగా మారింది.

గోకవరంలో పెరుగుతున్న కేసులు

గోకవరం, ఆగస్టు 24 : గోకవరం మండలంలో జ్వరాలు వణి కిస్తున్నాయి. మలేరియా,టైఫాయిడ్, ప్లేట్‌లేట్స్ తగ్గడం, రొంప,ఒంటి నొప్పులు,దగ్గు,తదితర రోగాలు పట్టిపీడిస్తు న్నాయి. పిల్లలు, పెద్దలు, వృద్ధులు అనే తేడా లేకుండా మంచాన పడుతున్నారు. గోకవరం ప్రభుత్వాసుపత్రితో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల వద్ద జ్వరపీడితులు క్యూకడుతున్నారు. మరికొంత మంది ఆర్‌ఎంపీలను ఆశ్రయించి ఇళ్ల వద్దే చికిత్స పొందుతున్నారు. బాగా నీరసి ంచిన చాలా మంది రోగులు రాజమహేంద్రవరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.గోకవరం ప్రభుత్వాసు పత్రి కి వచ్చే రోగుల సంఖ్యను పరిశీలిస్తే ఈ నెల 20న 417 ఓపీ ఉం డగా,21న 227 ఓపీ ఉంది.తాజాగా గురువారం 260 మంది కిపైగా రోగులు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ ప్రభు త్వాసుపత్రిని ఆశ్రయించారు.రోగుల్లో సగానికి పైగా జ్వరాలు,విరేచనాలు, రొంప, కీళ్ల నొప్పులతో వస్తున్నవారే కనిపిస్తున్నారు.

- పెరుగుతున్న డెంగీ, వైరల్ జ్వరాలు
- ఒక్కో ఇంట్లో మూడు నాలుగు కేసులు
- ప్రైవేటు ఆసుపత్రులకు పరుగు
- జేబు ఖాళీ చేస్తున్న వైద్యులు
- సీహెచ్‌సీలలో రోజుకు 50 కేసులు
- గోకవరంలో 200 దాటుతున్నాయ్
- అయినా కదలిక లేని వైద్య సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న రోగులు

జ్వరం వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి..



తగు జాగ్రత్తలు తీసుకుంటే ఉపశమనం పొందవచ్చు.ఈ సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రజలంతా కాచి చల్లార్చిన నీటినే తాగాలి. మాంసాహారాలకు దూరంగా ఉండాలి. మితాహారం తినాలి. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే మలేరియా, డెంగీ వ్యాధులను అరికట్టవచ్చు.

- గట్టి రామభాస్కర్, రాజానగరం పీహెచ్‌సీ వైద్యాధికారి

50 వేలకు ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గకూడదు..



ప్రస్తుతం పలువురిలో జ్వరాల లక్షణాలు ఉన్నాయి. దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణంగా 4 లక్షల ప్లేట్‌లెట్స్ కౌంట్ ఉండాలి.. 2,50,000 కౌంట్ తగ్గకూడదు. 50 వేలకు పడిపోతే వైద్యులను సంప్రదించాలి. కాచి చల్లార్చిన నీరు తాగాలి. వేడి ఆహారం తీసుకోవాలి. గుండె జబ్బులు, బీపీ ఉన్నవారు జ్వరాల లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- డా. శివశంకర్ , కడియం సీహెచ్‌సీ వైద్యాధికారి



అనపర్తి ఆసుపత్రిలో నిండుగా బెడ్లు



బదిలీలకు.. ఓకే!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

- సాధారణ ఉద్యోగులకు గ్రీన్‌సిగ్నల్
- తొలుత ఉన్నతాధికారుల బదిలీ
- ఇప్పుడు మిగతా ఉద్యోగుల వంతు
- 19 నుంచి మొదలైన సందడి
- అన్ని డిపార్ట్‌మెంట్లకు అవకాశం
- 27 వరకూ దరఖాస్తుల స్వీకరణ
- సచివాలయ ఉద్యోగులకు ఛాన్స్
- ఎమ్మెల్యేల సిఫారసులకు క్యూ
- 31వ తేదీన పోస్టింగ్‌లు

ప్రభుత్వ ఉద్యోగుల్లో బదిలీ సందడి నెలకొంది. ఈ నెల 19వ తేదీ నుంచి సందడి మొదలైంది.ఈ నెల 31వ తేదీ లోపు బదిలీల ప్రక్రియపూర్తి కావాలని ప్రభుత్వం గడువు విధించింది. చాలా కాలం తర్వాత సాధారణ బదిలీలు జరుగుతున్నాయి. జిల్లాలో అన్ని డిపార్ట్‌మెంట్ల ఉద్యోగులు తాము కోరుకున్న ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. సీఎం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదట కలెక్టర్, ఎస్పీ, జేసీ వంటి ప్రధాన బదిలీలు జరిగిన సంగతి తెలిసిందే. డీఎస్పీలు, ఆర్డీలు, సీఐలు, తహశీల్దార్ల బదిలీలు ఇప్పటికే చాలా వరకూ పూర్తయ్యాయి. ప్రస్తుతం వివిధ శాఖల్లో కింది స్థాయి ఉద్యోగి వరకూ బదిలీ జరగనుంది. కేవలం జైళ్ల శాఖకు మాత్రం బదిలీలు లేవు. ఇక జిల్లాలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, సివిల్ సప్లయిస్, మైనింగ్ అండ్ జియాలజీ, అన్ని విభాగాలకు చెందిన ఇంజనీరింగ్ స్టాఫ్, ఎండోమెంట్, ట్రాన్స్‌పోర్ట్ ,ఇఎఫ్అండ్‌టీ, ఇండస్ట్రీస్, ఎనర్జీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, కమర్షియల్ టాక్సెస్, ఎక్సయిజ్ శాఖల్లో బదిలీలు జరగనున్నాయి.ఈ మేరకు చాలా విభాగాల ఉద్యోగులు ఎమ్మెల్యేల సిఫార్స్ లేఖలు తీసుకుంటున్నారు.ఎవరికి వారు ఇష్టమైన చోట పోస్టు కొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎవరి దారులు వారు వెతుకుంటున్నారు. ఎమ్మెల్యేలు లెటర్లు ఇవ్వకపోతే ఇతర మార్గాలపై దృష్టిపెడుతున్నారు.

27వ తేదీ వరకూ అవకాశం..

ఈ నెల 27వ తేదీ లోపు అన్ని డిపార్ట్‌మెంట్ల ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఉండాలి. 31వ తేదీలోపు వారికి పోస్టింగ్‌లు ఇస్తారు. ఇంజనీరింగ్ విభాగంలో చాలా మంది ఇంజనీర్లు బదిలీ కానున్నారు. ఐదేళ్లు దాటిన వారంతా బదిలీ అవుతారు. మునిసిపాలిటీలో మాత్రం ఎక్కడి వారు అక్కడే ఉండిపోయేలా ప్రయత్నిస్తున్నారు. చిన్న స్థాయి నుంచి మంత్రుల వరకూ జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఎవరు అందుబాటులో ఉంటే వారితో సిఫార్స్ చేయించుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా డబ్బు ప్రధాన భూమిక పోషిస్తున్న సంగతి తెలిసిందే.

సచివాలయ ఉద్యోగులకు ఇలా..

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఐదేళ్లు నిండితేనే బదిలీ. రిక్వెస్ట్ బదిలీలు ఉన్నాయి.కానీ ఇవన్నీ ఉమ్మడి జిల్లాల పరిధిలోనే జరుగుతున్నాయి.సచివాలయాలకు సంబంధించి పంచాయతీరాజ్ రూరల్ డెవలమెంట్,అందు లోని ఇంజనీరింగ్ విభాగం,యానిమల్ హజ్బెండరీ, ఫిషరీష్, హోంలకు చెందిన ఉద్యోగులను ఉమ్మడి జిల్లా కలెక్టర్ బదిలీ చేస్తారు.మెడికల్ అండ్ హెల్త్‌కు సంబం ధించి డీఎంహెచ్‌వో బదిలీ చేస్తారు. మ్యూచువల్ ట్రాన్స్ ఫర్లు ఉన్నట్టు చెబుతున్నారు.అంతరజిల్లాల బదిలీల విష యంలో ఆన్‌లైన్ దరఖాస్తు అవకాశం లేదు. మాన్యు వల్ గా ఆయా ఉమ్మడి జిల్లాల కలెక్టర్లకు దరఖాస్తు చేస్తే వాటిని పరిశీలిస్తారు. ఈ విధంగా ప్రస్తుతం జిల్లాలో బదిలీ సందడి నెలకొంది.

పిల్లల వైద్యానికి డీఈఐసీ

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24 : పుట్టుక నుంచి 18 ఏళ్లలోపు వయస్సు వారికి అన్ని రకాల లోపాలు, వ్యాధులు, కౌమార దశ బాలికల సమస్యలకు జిల్లా సత్వర చికిత్స కేంద్రం (డీఈఐసీ) ద్వారా వైద్యసేవలు అందజేయడం జరుగుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు వెల్లడించారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో శనివారం వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డీఈఐసీ, జిల్లా జాతీయ హెల్త్‌మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా నాలుగు ప్రధాన లోపాలతో బాధపడుతున్న పిల్లలకు డీఈఐసీలో చికిత్స అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏహెచ్, జీజీహెచ్ తదితర డెలివరీ పాయింట్లలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందికి మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. డీఈఐసీలో వైద్య నిపుణులందరూ అందుబాటులో ఉంటారని, పిల్లల్లో వచ్చే లోపాలను, వ్యాధులను ముందుగానే గుర్తించి వారికి డీఈఐసీ ద్వారా వైద్యసేవలు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌పీఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ హరిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

48 గంటల్లో ధాన్యం సొమ్ములు : జేసీ

చాగల్లు, ఆగస్టు 24 : కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ చినరాముడు అన్నారు. మండలంలోని నెలటూరి రైతు సేవా కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. పౌరసరఫరాల, మార్కెటింగ్, రెవెన్యూ అధికారులతో కలసి ధాన్యం కొనుగోళ్ల కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ముందస్తుగా జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, అనుబంధ పరికరరాలు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట పౌరసరఫరాల మేనేజర్ పి.రాధిక, మార్కెటింగ్ ఏడీ ఎం.సునీల్ విజయ్ ఉన్నారు.

మెడికల్ లీవ్ పెట్టేందుకు వెళ్లి..
ఉపాధ్యాయురాలి దుర్మరణం
గంజాయి ముఠా కోసం
పోలీసుల చేజింగ్
గాడిద పాలు తాగితే
రోగాలు తగ్గుతాయా!? 7



పోలీస్ సారూ.. మారదా తీరు!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

- ఇంకనూ ఫ్యాన్ కిందనే పని
- కూటమి వచ్చినా వైసీపీ వాసనే
- వైసీపీ నేతలకే రెడ్ కార్పెట్
- గతం మాదిరిగానే దందాలు
- స్టేషన్లలోనే సెటిల్‌మెంట్లు
- కూటమి నేతలు దృష్టిపెట్టాల్సిందే

కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు దాటింది. అయినా కొందరు అధికారుల్లో ఫ్యాను సమయంలో ఉన్న అలసత్వం పోవడం లేదు. లోపాయికారిగా వైసీపీ వైపు మొగ్గు చూపుతున్నారనే చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో రెండు నెలలు వేచి చూసినా బాధ్యత, జవాబుదారీతనం లేకుండా విధులు నిర్వర్తిస్తుండడం చూసి కూటమి పాలకులకు చిర్రెత్తుకొస్తోంది. జిల్లాలోని చాలా పోలీస్ స్టేషన్లలో ఇంకా వైసీపీ వాసనే వస్తోంది. జగన్ జమానాలో పోలీసులను రాజకీయ కక్ష సాధింపునకు విపరీతంగా వాడుకొన్న మాట జగమెరిగిన సత్యం. ఆ ఐదేళ్లలో ఠాణాలు సెటిల్‌మెంట్ కేంద్రాలుగా మారిపోయాయి. పాలకులే గడ్డి కరుస్తుండడం..అక్రమాలకు వత్తాసు పలకడంతో అధికారుల అమ్యామ్యాల పనిసులభంగా అయిపోయేది. స్టేషనుకు బాధ్యులుగా ఉండే సీఐ,ఎస్‌ఐలను కావాల్సి వాళ్లను సీట్లలో కూర్చోబెట్టుకోవడంతో దందాలకు అడ్డూ అదుపూ ఉండేది కాదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చినా చాలా మంది అధికారులు దందాల పంథా మార్చుకోవడం లేదు. ఐదేళ్లు మరిచిపోయిన జవాబుదారీతనాన్ని ఇప్పుడు తగిలించుకొని మామూళ్లను మామూలుగా వదులుకోవాలంటే ఆవేదన కలుగుతోంది. దీంతో వైసీపీ నాయకులకు అప్పట్లో పరిచిన రెడ్ కార్పెట్‌ని తీసి పారేయడానికి చాలా మంది అధికారులు, సిబ్బందికి చేతులు రావడం లేదు. వైసీపీ పాలనలో ఆ పార్టీ చోటా మోటా నాయకులు సీఐ, డీఎస్పీలను శాసించే స్థాయిలో దర్పం వెలగబెడుతూ దందాలు సాగించి జనాల నుంచి దండిగా దండుకున్నారు. ఆ రాబడిని వదులుకోలేక ఇంకా అలాగే కొనసాగుతున్న వాళ్లకు పోలీసులు కొందరు అండగా నిలుస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బదిలీలు చేపట్టింది.వైసీపీ దాష్టీకాలకు కొమ్ముకాసిన వాళ్లను పక్కన పెట్టారు. కానీ పరిస్థితి చూస్తుంటే అలా అని అనుకున్నారే గానీ క్షేత్ర స్థాయిలో ఆ మార్పు కనిపించకపోవడం ప్రభుత్వంపై విమర్శలకు తావిస్తోంది. సీట్ల మార్పిడిలో డబ్బుకు ప్రాధాన్యం ఇవ్వడంతో 'ఫ్యాను గాలి'కి బాగా అలవాటు పడిన వాళ్లు కూడా కీలకమైన స్టేషన్లను సాధించుకున్నారు. ఒక రకంగా వైసీపీకి కొమ్ముకాయలేక లూప్‌లైనులో ఉన్న వాళ్లకు అన్యాయమే జరిగింది. ఏదో చెస్ బోర్డులో పావు లను కదిపినట్లు జిల్లాలో పని చేస్తున్న వాళ్లను బదిలీ పేరుతో ఆ పక్కకో ఈ పక్కకో జరిపారు అంతే. వైసీపీ నేతలకు పూర్తిగా తొత్తులని పేరుబడిన వాళ్లకు మంచి స్టేషన్లనే కట్టబెట్టారు. దీంతో కొత్త సీసాలో పాత సారా మాదిరిగానే పరిస్థితి ఉంది. వైసీపీ నాయకులు స్టేషనుకు రాగానే సాదరంగా కుర్చీ ఆఫర్ చేసి, టీ ఇచ్చి మరీ మాట్లాడి పంపిస్తున్నారు. గతంలో టీడీపీ నాయకులను హీనంగా చూసేవాళ్లు. జనసేన, బీజేపీ వాళ్లను అసలు పట్టించుకోవడం జరిగేది కాదు. బాధితుడివైపు నిలబడినా టీడీపీ నాయకులపై కేసులు బనాయించి వేధించేవాళ్లు. కానీ అక్రమాలతో అంటకాగడం అలవాటు పడిన వైసీపీ నేతలకు మాత్రం ఇప్పటికీ రాచమర్యాదలు జరుగుతున్నాయి. సీఐలు, ఎస్‌ఐల బదిలీలపై కూటమి పాలకులు పెద్దగా దృష్టి పెట్టకపోవడం, ఈ రెండు నెలలూ కుదురుకోవడానికి సమయం సరిపోవడంతో సందట్లో సడేమియాగా బదిలీలు జరిగాయనే అపవాదు నడుస్తోంది. వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఛీ కొట్టినా స్టేషన్లలో మాత్రం మర్యాదలకు లోటుండడం లేదు. దీంతో చాలా మంది వైసీపీ నాయకులు ఫోన్లతోనే పని కానిచ్చేస్తున్నారు.

అర్ధరాత్రి గంజాయి ముఠా కోసం
పోలీసుల చేజింగ్

- నెల్లూరు రూరల్ డీఎస్పీపైకి దూసుకెళ్లిన కారు
- నెల్లూరు, తిరుపతి పోలీసుల అప్రమత్తం
- గూడూరు మీదుగా కడప జిల్లాలోకి వెళ్లే ప్రయత్నం
- అడుగడుగునా వెంబడించిన పోలీసులు
- చేజింగ్‌లో కాలువలోకి దూసుకెళ్లిన సీఐ వాహనం
- రోడ్డు లేకపోవడంతో పొలాల్లో ఆగిన కారు
- డ్రైవర్ అరెస్ట్.. మరో ఇద్దరు ఏమయ్యారు?
- పూర్తిస్థాయిలో విచారిస్తున్న పోలీసులు
- డ్రైవర్ సూర్యనారాయణది రాజానగరం





కల్వర్టును ఢీకొని కాలువలోకి దూసుకెళ్లిన ఆత్మకూరు సీఐ వాహనం... పోలీసుల అదుపులో కారు డ్రైవర్ సూర్యనారాయణ

నెల్లూరు(క్రైం)/వెంకటాచలం/మర్రిపాడు, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం దుంగలు, గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాలను పట్టుకునేందుకు పోలీసు వాహనాలు రయ్.. రయ్.. మంటూ దూసుకుపోయే దృశ్యాలు సినిమాల్లో చూస్తుంటాం. సాహసోపేత చేజింగ్‌లు చేసి చివరకు దొంగలను పట్టుకుంటారు. అలాంటి సీన్ నెల్లూరు జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సాగింది. ఓ గంజాయి ముఠాను పట్టుకునేందుకు నెల్లూరు, తిరుపతి జిల్లాల పోలీసులు రాత్రంతా కంటిమీద కునుకులేకుండా కష్ట పడ్డారు. చివరకు కారుతోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ చేజింగ్‌లో డీఎస్పీ గాయాలపాలవగా, ఇద్దరు సీఐలకు త్రుటిలో ప్రమాదం తప్పింది.

● అసలేం జరిగిందంటే..

విశాఖ నుంచి చెన్నైకు ఓ వాహనంలో భారీగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం శుక్రవారం రాత్రి నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్‌రావు అందింది. వెంటనే ఆయన కోవూరు పోలీసులను అప్రమత్తం చేశారు. ఈలోపు ఏపీ39డీజే1000 నెంబరు గల తెలుపురంగు కారు వేగంగా లారీల మధ్యలో దూసుకెళ్లింది. ఈ విషయాన్ని పోలీసు అధికారులకు తెలియజేశారు. వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద అర్ధరాత్రి రూరల్ డీఎస్పీ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. సరిగ్గా 1.30 గంటల ప్రాంతంలో కోవూరు పోలీసులు తెలిపిన నెంబరు గల కారు అక్కడకు రావడంతో ఆపారు. డ్రైవర్ పక్కగా నిలపగా తనిఖీ చేసేందుకు డీఎస్పీ వెళ్లారు. ఒక్కసారి కారు వాయువేగంతో ముందుకు దూసుకెళ్లింది. దీంతో డీఎస్పీ కింద పడటంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందజేసి, అప్రమత్తం చేశారు. తిరుపతి జిల్లా పోలీసులకూ సమాచారం ఇచ్చారు. గాయపడిన డీఎస్పీని నెల్లూరులోని ఓ ప్రైవేటు అసుపత్రికి తరలించారు.

● 3 గంటలు టెన్షన్.. టెన్షన్

వెంకటాచలం టోల్‌ప్లాజా నుంచి దూసుకెళ్లిన కారు తెల్లవారుజామున 4.20 గంటల వరకు మూడు గంటలపాటు పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేసింది. వెంకటాచలం దాటిన తర్వాత బూదనం టోల్‌ప్లాజా వద్దకు కారు వస్తుందని తిరుపతి జిల్లా పోలీసులు అక్కడ కాపుకాశారు. అయితే అనూహ్యంగా గూడూరు పట్టణంలోకి వెళ్లి పాత బస్టాండు వద్ద విధుల్లో ఉన్న వాకాడు ఇన్‌స్పెక్టర్ హుస్సేన్ బాషా, పోలీసులపైకి దూసుకెళ్లింది. రెప్పపాటులో వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. అక్కడ నుంచి పొదలకూరు మీదుగా చేజర్ల, కలువాయి, అప్పారావుపాలెం, ఆత్మకూరు మీదుగా కడప వెళ్లేందుకు డ్రైవర్ ప్రయత్నించాడు.

● పొలాల్లోకి వెళ్లి దొరికిపోయి..

జిల్లావ్యాప్తంగా అప్రమత్తమైన పోలీసులు ప్రతి కూడలిలో తనిఖీలు ముమ్మరం చేశారు. నెల్లూరు-ముంబయి రహదారిలోని మర్రిపాడు మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద కాపుకాశారు. టోల్‌ప్లాజా ముందున కోనసముద్రం గ్రామం వైపు తెల్లవారుజామున 4.20 గంటలకు తెలుపు రంగు కారు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆత్మకూరు సీఐ గంగాధర్ తన సిబ్బందితో కారును వెంటాడారు. అయితే కోనసముద్రం సమీపంలో మలుపు వద్ద కల్వర్టుపై సిమెంట్ దిమ్మెను సీఐ కారును ఢీకొని కాలువలోకి దూసుకెళ్లింది. అయితే వెనుకే వస్తున్న మరో పోలీసు వాహనం కారును వెంటాడింది. కోనసముద్రం గ్రామం దాటాక పొలాలు మాత్రమే ఉండటంతో రోడ్డు లేక కారు అక్కడే ఆగిపోయింది. వెంటనే పోలీసులు కారుతోపాటు డ్రైవర్ సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని రాజానగరం వాసిగా పోలీసులు గుర్తించారు.

● గంజాయి ఏమైంది!?

వెంకటాచలం వద్ద కారులో డ్రైవర్‌తోపాటు ముగ్గురు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అయితే, డ్రైవర్ మాత్రమే పట్టుబడటంతో మిగిలిన ఇద్దరు ఏమయ్యారని పోలీసులు ఆరా తీస్తున్నారు. కారు రవాణా చేస్తున్న గంజాయి ఎక్కడ డంప్ చేసి ఉంటారని విచారిస్తున్నారు. ఏదిఏమైనా అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు టెన్షన్ పెట్టిన కారు చివరకు దొరకడంతో పోలీసులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు.



రామన్నపాలెం జంక్షన్ వద్ద పట్టుబడిన గంజాయి బస్తాలు

813 కిలోల గంజాయి స్వాధీనం

గోకవరం, ఆగస్టు 24: బొలెరో వాహనంలో రవాణా చేస్తున్న 813.590 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు గోకవరం ఎస్ఐ వీఎస్‌వీ పవన్‌కుమార్ తెలిపారు. గంజాయి రవాణా జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు గోకవరం మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ శివారు గ్రామమైన రామన్నపాలెం జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో బొలెరో ట్రక్ వాహనంలో తరలిస్తున్న గంజాయిని గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బొలెరో వాహనంలో గంజాయిని లెక్కించగా 25 ప్లాస్టిక్ గోనె సంచుల్లో 813.590 కిలోలు ఉన్నట్టు నిర్ధారించారు. దీని విలువ రూ.40,67,950 ఉంటుందని, నిందితుల ఆచూకీ తెలియాల్సి ఉందని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. కేసులో ప్రతిభ కనబర్చిన సిబ్బందిని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.



పట్టుకున్న నిందితుల వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్‌మీనా

350 కిలోల గంజాయి స్వాధీనం

మోతుగూడెం, ఆగస్టు24: ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశాలతో చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్‌కుమార్ మీనా ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్ పోస్టు వద్ద మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు, తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో గంజాయిని తరలిస్తున్న వాహనాన్ని (టీఎస్ 07యూఏ 3969) ఆపి తనిఖీ చేయగా 350 కిలోల గంజాయి, 100 గ్రాముల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఒడిశాలోని కుర్మనూరుకు చెందిన రెడ్డి, మహారాష్ట్రకు చెందిన అన్వార్ అలీ సయ్యద్, యూనుస్ ముస్తాఫ్ షేక్ గంజాయికొని మోతుగూడెం గ్రామ శివారులోని అడవిలో దాన్ని ఈ వాహనంలోకి లోడ్ చేసి మహారాష్ట్రలోని లాతూర్‌కి తరలిస్తుండగా పట్టుకున్నామని అడిషనల్ ఎస్పీ చెప్పారు. ఒడిశాకు చెందిన రెడ్డి, మహారాష్ట్రకి చెందిన సతీష్‌లు పరారీలో ఉన్నారని, పట్టుకున్న గంజాయి విలువ రూ.17,60,00 విలువ ఉంటుందన్నారు. జూన్ ఒకటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలనకోసం 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చింతూరు సర్కిల్‌లో మొత్తం 16 కేసులు నమోదు చేసి, 43 మందిని అరెస్ట్ చేశామన్నారు. వీరి వద్ద నుంచి 1670 కేజీల గంజాయిని, 23 వాహనాలను సీజ్ చేశామని చెప్పారు.

సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



హైకోర్టు న్యాయమూర్తికి స్వామివారి మెమెంటో అందజేస్తున్న ఈవో

అన్నవరం, ఆగస్టు 24: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి సుమతి జగడం తన కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు.

పాదగయలోనూ పూజలు

పిఠాపురం, ఆగస్టు 24: పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని రాష్ట్ర హైకోర్టు జడ్జి జె.సుమతి శనివారం సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి పాదగయలోని కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు హైకోర్టు జడ్జికి క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ ఈవో, సహాయ కమిషనరు దుర్గాభవానీ హైకోర్టు జడ్జికి ప్రసాదాలు అందజేశారు. అనంతరం జడ్జి పిఠాపురంలో నిర్మించిన కోర్టు భవనాన్ని పరిశీలించారు. ఆమె వెంట పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి, సబ్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి, అదనపు జడ్జి వంగా వెంకట అపర్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రాజారావు, కేఎస్ఆర్ భాస్కర్, ఉపాధ్యక్షుడు ఎస్ఎం అలీ పాల్గొన్నారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

భక్తవత్సల గోవింద!

వాడపల్లి ఒక్కరోజు ఆదాయం రూ.29.97 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 24: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. కాగా వివిధ సేవల ద్వారా స్వామి ఒక్కరోజు ఆదాయం రూ.29.97 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తజనం



పెద్దాపురం, ఆగస్టు 24: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునుంచే బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,19,700 అన్నదాన విరాళాలు రూ.57,488 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.7,080, తులాభారం ద్వారా రూ.750, లడ్డూ ప్రసాద విక్రయం ద్వారా రూ. 18,990 వెరసి రూ.2,04,008 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వి.శ్రీనివాసరావు తెలిపారు. సుమారు మూడు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.1.94 లక్షలు

మామిడికుదురు, ఆగస్టు 24: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1,94,143 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. బాలబాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని మొత్తం 2,693 మంది దర్శించుకున్నారు. 1,875 మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. అన్నదానానికి ఆదుర్రు గ్రామానికి చెందిన వంతాడి కామేశ్వరవర్మ-పద్మలత దంపతులు రూ.10,116 విరాళం అందించారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

వచ్చే నెల 14న లోక్ అదాలత్

రాజమహేంద్రవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 14న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 15 కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. ఆ రోజున ఉదయం పది గంటల నుంచి రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రాపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక బెంచ్‌లలో విచారణ పెండింగ్‌లో ఉన్న సివిల్, ప్రమాదాలు, బ్యాంకు కేసులతోపాటు రాజీకి అర్హమైన క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తారన్నారు. న్యాయవాదిని నియమించుకోలేని వారు, చదవడం, రాయడం రాని వారు కూడా నేరుగా ఆయా కోర్టు ప్రాంగణాల్లో ఉన్న న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే న్యాయ సహాయం అందజేస్తారన్నారు. లోక్ అదాలత్‌లో కేసును పరి ష్కరించుకోవడం వల్ల ఇరు పక్షాలకూ సమయం, ఖర్చు ఆదా అవుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీడీజే గంధం సునీత ఒక ప్రకటనలో కోరారు.

గాడిద పాలు తాగితే.. రోగాలు తగ్గుతాయా!?





వీదుల్లో గాడిద ను వెంటబెట్టుకుని పాలు అమ్ముతామని తిరుగుతున్న వ్యక్తి

- ఉబ్బసం, దగ్గు, నడుమునొప్పులు పోతాయని అమ్మకాలు
- తెలంగాణ నుంచి వచ్చి రాజమహేంద్రవరంలో విక్రయాలు.. కప్పు గాడిద పాలు రూ.300
- కేవలం ఇది నమ్మకమే తప్ప శాస్త్రీయత లేదంటున్న వెటర్నరీ డీడీ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 24: గాడిదలా పెరిగావు..? పనికిరాని గాడిద..? పూర్వం ఖాళీగా తిరిగే వాళ్లను మన పూర్వీకులు అనే మాటలివి.. ప్రస్తుతం ఈ మాట అనడానికి ఎవ్వరూ సరిపోరు. ఎందుకంటే నేటి తరం గాడిదలూ పనికొస్తాయని నిరూపించారు. అదెలాగంటే.. కొన్ని రకాల రోగాలకు గాడిద పాలు పనిచేస్తాయని తెలియడంతో వాటికి డిమాండ్ ఏర్పడింది. గాడిద పాల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందినవారు గాడిదలను పెంచుతూ వాటిని తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లో రాజమహేంద్రవరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో 15 రోజులు ఉండి ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7:30 గంటల మధ్య వీధుల వెంబడి తిరుగుతూ స్వయంగా గాడిదలను తీసుకువచ్చి కప్పు వరకు పిండి వాటిని విక్రయిస్తున్నారు. శనివారం రాజమహేంద్రవరంలో చిన్నగ్లాసు రూ.200, టీ కప్పు రూ.300 లకు విక్రయించారు. గాడిద పాలు ఉబ్బసం, దగ్గు, కఫం, నడుమ నొప్పులకు చాలా మంచిదని ఆ పాలు అమ్మేవారు చెబుతుండడంతో డిమాండ్ బాగా పెరిగింది. సగటున రోజుకు ఐదు కప్పుల గాడిద పాలు అమ్మడం కనిపించింది. వాస్తవానికి గాడిద రోజుకు 100 మిల్లీలీటర్ల పాలు మాత్రమే ఇస్తుంది. కానీ ఇక్కడ వీళ్ళు విక్రయించే పాలు చూస్తే 200 ఎంఎల్ ఉంటుంది కానీ ప్రజలు అవేమి ఆలోచించకపోవడం గమనార్హం. అయితే కొన్ని రకాల మందుల తయారీలో గాడిద పాలు వినియోగిస్తారే తప్ప నేరుగా తీసుకునే పరిస్థితి లేదనే వాదన ఉంది.

గాడిద పాలనేది నమ్మకం మాత్రమే



గాడిద పాలను తాగితే కొన్ని రకాల జబ్బులు తగ్గుతాయని అనుకోవడం ప్రజల నమ్మకం తప్పితే దానికి ఆధారాలులేవు. గతంలో నడుము పనిచేయని ముసలివాళ్ళు గాడిద మాంసం తింటే లేచిని లబడతారనే నానుడి ఉండేది. దగ్గు, కఫం వంటివి తగ్గుతాయని ప్రజలు నమ్ముతారే తప్ప దానికి ఎటువంటి శాస్త్రీయ అధారాలు లేవు. పైగా రోజుకు 100 ఎంఎల్ పాలు మాత్రమే ఇచ్చే గాడిద 250 ఎంఎల్ వరకు పాలు ఎలా ఇస్తుంది. అంటే ఇప్పటికే ఆవులు, గేదెలు పాలు పెంచే ఆక్సిటోస్ ఇంజక్షన్ ప్రభుత్వం బ్యాన్ చేసింది. అది బయట మార్కెట్‌లో అక్రమంగా అమ్ముతున్నారనే అను మానం ఉంది. ఆ ఇంజక్షన్ వినియోగించి గాడిద పాలు పెంచుకుని ప్రజలను మోసం చేసే అవకాశం ఉంది. ఇంజక్షన్ చేసిన పాలు తాగితే మోకాళ్ళ నొప్పులు వస్తాయి.

- డాక్టర్ వెంకటేశ్వరావు, డీడీ పశుసంవర్ధక శాఖ, తూర్పుగోదావరి జిల్లా



సమావేశంలో మాట్లాడుతున్న జలగం కుమారస్వామి

28న అమలాపురంలో అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సు

అమలాపురం టౌన్, ఆగస్టు24: కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గాలు పొందాలనే లక్ష్యంతో ఈనెల 28న అమలాపురంలో అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్టు భారతీయ కిసాన్‌సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి పేర్కొన్నారు. కొబ్బరి రైతులు తెగుళ్ల బెడదతోపాటు దిగుబడులు తగ్గిపోయి కొబ్బరికాయలకు ధర లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని అధిగించే విధంగా ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో శనివారం బీకేఎస్ జిల్లాశాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న ఈదరపల్లిలోని జనహిత కార్యాలయంలో దక్షిణ భారతదేశానికి చెందిన కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాలకు చెందిన కొబ్బరి రైతులతో ముందస్తు సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మార్కెటింగ్ వ్యవస్థ వల్ల కొబ్బరి రైతులకు కలుగుతున్న మేలు, నష్టాలపై చర్చించడంతోపాటు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలు, అందించాల్సిన ప్రోత్సాహకాలపై పలు తీర్మానాలు రూపొందించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొబ్బరికాయలు కొనుగోలు చేయాలని ఆదేశించి నిర్దిష్ట ధరను ప్రకటించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు ఆ విధంగా కొనుగోలు వ్యవస్థలను ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని వివరించారు. ఈనెల 28న అమలాపురం కిమ్స్ ప్రాంగణంలో అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సును నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సులో బీకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీమోహనమిశ్రా, అఖిలభారత ఉపాధ్యక్షుడు పెరుమాళ్లు పాల్గొని కొబ్బరి రైతులకు మార్గదర్శకం చేస్తారన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొంటారన్నారు. సదస్సుల్లో ఆమోదించిన తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి బీకేఎస్ తరఫున తీసుకువెళతామని జిల్లా అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం తెలిపారు. సమావేశంలో పూర్వపు జిల్లా అధ్యక్షుడు బొక్కా ఆదినారాయణ, సీనియర్ నాయకులు ఉప్పుగంటి భాస్కరరావు, అడ్డాల గోపాలకృష్ణ, తిక్కిరెడ్డి గోపాలకృష్ణ, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, సూర్యనారాయణరాజు, అప్పారి వెంకటరమణ పాల్గొన్నారు.





లారీ ఢీకొని మృతి చెందిన ఉపాధ్యాయిని.. రాజారత్నం (ఫైల్‌ఫొటో)

కుమార్తె ఆరోగ్యం బాగాలేదని ఇంటికి వెళుతూ

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని మృతి

కొవ్వూరు, ఆగస్టు 24: కొవ్వూరు మండలం దేచర్ల గ్రామంలో లారీ ఢీకొని ఉపాధ్యాయురాలు మృతి చెందింది. రాజమహేంద్రవరం కంబాలచెరువు ప్రాంతానికి చెందిన బడుగు రాజారత్నం(47) దేవరపల్లి మండలం గౌరీపట్నం హైస్కూల్లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్నారు. కుమార్తె నిషితకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో 5 రోజులు మెడికల్ లీవు పెట్టడానికి పాఠశాలకు రాజమహేంద్రవరం నుంచి బస్సులో వచ్చారు. పని ముగించుకుని ఇంటికి వెళ్లడానికి పాఠశాలలో పనిచేస్తున్న లెక్కల మాస్టారు కదిరి మురళీకృష్ణప్రసాద్‌ను గౌరీపట్నం సెంటరులో బైక్‌పై డ్రాప్ చేయాలని కోరారు. గౌరీపట్నం సెంటర్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలుపుదల చేయకపోవడంతో పంగిడి సెంటర్‌లో డ్రాప్ చేయాలని కోరడంతో ఇద్దరూ బైక్‌పై బయలుదేరారు. వర్షం కారణంగా రోడ్డు పక్కన మట్టి చేరడంతో దేచర్లలోని త్రివేణి ఫ్యాక్టరీ సమీపంలో బైక్ జారడంతో కిందపడిపోయారు. మురళీకృష్ణప్రసాద్ పైకిలేచి చూసేసరికి వెనుక వస్తున్న లారీ రాజారత్నం తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కొవ్వూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త వి.రాజేంద్ర ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.శ్రీహరి కేసు నమోదు చేశారు.

బెహ్రాయిన్‌లో మరణించిన నాగసాయి మృతదేహం స్వగ్రామానికి..



మామిడికుదురు, ఆగస్టు24: ఉపాధి కోసం పరాయి దేశం బెహ్రాయిన్ వెళ్లి అక్కడ ఆత్మహత్యకు పాల్పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నంలంక గ్రామానికి చెందిన నాగులపల్లి వీరవెంకటదుర్గానాగసాయి (22) మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరుకుంది. కుటుంబానికి అండగా నిలుస్తాడనుకున్న కుమారుడు మృతదేహంగా తిరిగి రావడంతో తల్లి అనంతలక్ష్మి, చెల్లి భానులక్ష్మి విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కుటుంబానికి అండగా నిలుస్తాడని అనుకున్న కుమారుడికి అప్పుడే నిండు నూరేళ్లు నిండిపోయ్యాయని తల్లి రోధిస్తున్న తీరు కలచివేసింది. ఈ ఏడాది జూలై 29న ఉపాధి కోసం బెహ్రాయిన్ వెళ్లిన దుర్గానాగసాయి అక్కడ పెట్రోలు బంకులో పనిచేస్తూ ఈనెల 17న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సాయి మృతదేహానికి శుక్రవారం రాత్రే స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

తూర్పుగోదావరి

ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలకు న్యాక్ బీ గ్రేడు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24: రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బీ గ్రేడు లభించింది. ఈనెల 13, 14 తేదీల్లో న్యాక్ కమిటీ కళాశాలను సందర్శించి సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు పరిశీలించిన తర్వాత బి గ్రేడును ప్రకటించినట్టు ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు తెలిపారు. ఆయా విభాగాధిపతుల సమష్టి కృషి ఫలితంగానే కళాశాలకు అత్యుత్తమ ర్యాంకు లభించిందని, కొన్ని నెలల ముందునుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో అనుకున్న లక్ష్యాన్ని అధిగమించామని ఆయన పేర్కొన్నారు. అధ్యాపక బృందాన్ని, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

ఏజెన్సీ సమాచారం



నాలుగు బెడ్లు మీదే చికిత్స పొందుతున్న రోగులు

విజృంభిస్తున్న విషజ్వరాలు

● ఆసుపత్రిలో బెడ్లు కొరత

మోతుగూడెం, ఆగస్టు 24: చింతూరు మండలం మోతుగూడెం విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రాథమిక ఆసుపత్రిలో జ్వరాలతో అనేక మంది చికిత్స పొందుతున్నారు. వచ్చిన వారికి రక్తపరీక్షలు చేస్తున్నారు. వీరిలో అనేకమందికి టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలతో బాధపడుతున్నారు. దీంతో గ్రామసులు భయాందోళనకు గురువుతున్నారు. మోతుగూడెం పీహెచ్‌సీలో రోగులకు ఉచితంగా వైద్య సదుపాయాలకు ఈ ఆసుపత్రిలో నాలుగు బెడ్లు మాత్రమే ఉన్నాయి. రోగుల సంఖ్య అధికం కావడంతో అత్యవసర కేసులకు సెలైన్‌లు అందిస్తున్నారు. మెరుగైన వైద్య సదుపాయం, మందులు ఉన్నప్పటికీ ఆసుపత్రి నిర్మాణం పూర్తికాకపోవడంతో బెడ్లు తక్కువగా ఉన్నాయని వర్షం కురిస్తే గదుల్లో నీరుకారుతున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్మిస్తున్న కొత్త ఆసుపత్రి నిర్మాణం తొందరగా పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేస్తే రోగులకు మరింత వైద్య సదుపాయం కల్పించాలని అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

రాజవొమ్మంగిలో భారీ వర్షం

● పొంగుతున్న వాగులు ● ప్రమాదకరంగా మారిన ప్రయాణాలు



నెల్లిమెట్ల కాజ్‌వేను దాటుతున్న గిరిజనుడు

రాజవొమ్మంగి, ఆగస్టు 24: రాజవొమ్మంగి మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి కురిసిన భారీ వర్షానికి మండల వ్యాప్తంగా కొండ వాగులు పొంగిపొర్లాయి. అర్అండ్‌బీ రోడ్డుపై ఉన్న కాజ్‌వేలపై కొండవాగులు ఉగ్రరూపం దాల్చి ప్రవహించడంతో ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణికులు వాగులు దాటారు. మండలంలోని రాజవొమ్మంగి-శాంతినగర్, నెల్లిమెట్ల కాలనీ-లబ్బర్తి, ముల్లిమెట్ల-లాగరాయి, వట్టిగెడ్డ-ఎర్రంపాడు గ్రామాల మధ్యలో రోడ్డుపై ఉన్న కాజ్‌వేలపై వాగులు పొంగి ప్రవహించడంతో సుమారు 25 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పనుల నిమిత్తం గ్రామాల నుంచి బయటకు వచ్చే వారు మాత్రం ప్రమాదపు అంచున ప్రయాణం చేశారు. రెవెన్యూ, పోలీసు అధికారుల పర్యవేక్షణ లోపమే ప్రమాదకరంగా వాగులు దాటేందుకు కారణమని ప్రజలు చర్చించుకుంటున్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు చెప్పాలి

● ఐటీడీఏ పీవో ఆకస్మిక పర్యటన



విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో సింహాచలం

దేవీపట్నం, ఆగస్టు 24: ఏజెన్సీలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో పాఠాలు చెప్పాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం మండలంలోని పెద్దభీంపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలను పీవో ఆకస్మికంగా పరిశీలించారు. ముందు విద్యార్థులకు ఉపాధ్యాయులు ఏవిధంగా పాఠాలు బోధిస్తున్నారు, మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆరా తీశారు. ఈసందర్భంగా పీవో సింహాచలం మాట్లాడుతూ ఇప్పటివరకు టైంటేబుల్ ప్రకారం ప్రతీరోజు ఏఏ పాఠాలు చెప్పారో అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నభోజన పథకంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలన్నారు. పాఠశాలల్లో దోమలు ప్రబలకుండా పనికిరాని మొక్కలు తొలగించాలన్నారు. విద్యార్థులకు అందజేసే పుస్తకాలు, బట్టలపై ఆరా తీశారు.

బేస్‌లైన్ టెస్టుల పరిశీలన

మండలంలోని ఇందుకూరుపేట, కృష్ణునిపాలెం ఆర్ అండ్‌ఆర్ కాలనీల్లోని జడ్పీహెచ్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న బేస్‌లైన్ టెస్టులను శనివారం అధికారులు పర్యవేక్షించారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో 3నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల మేధస్సును పరిశీలించే నిమిత్తం ఈ బేస్‌లైన్ టెస్టులు నిర్వహిస్తామన్నారు. వీటిని దేవీపట్నం తహసీల్దార్ పి.రామకృష్ణ పర్యవేక్షించారు.

పాఠశాలలను పరిశీలించిన ఐటీడీఏ పీవో

రంపచోడవరం, ఆగస్టు 24: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఆయన మండలంలోని ఐ.పోలవరం, దేవీపట్నం మండలం పెదభీంపల్లి ఎంపీపీ పాఠశాలలను ఆకస్మిక పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం అందించాల న్నారు. అలాగే పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

బేస్‌లైన్ పరీక్షలు తనిఖీ చేసిన ఎంపీడీవో



బేస్‌లైన్ పరీక్షల తనిఖీల్లో పాల్గొన్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం, ఆగస్టు 24: మండలంలో పలు పాఠశాలల్లో జరుగుతున్న బేస్‌లైన్ పరీక్షలను శనివారం ఎంపీడీవో కె.బాపన్నదొర తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాలతో మండలంలోని దేవరమడుగుల, పెదపాలెంపాడు ఎంపీపీ పాఠశాలలు, చవిటిదిబ్బలు, ఎర్రంరెడ్డిపాలెం జీపీఎస్ పాఠశాలలు, దాలిపాడు, కోట, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల బేస్‌లైన్ పరీక్షలు తనిఖీచేసి పలు సూచనలు ఇచ్చారు. పాఠశాలల్లోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కూనవరం, ఆగస్టు 24: మండలంలో టేకుబాక, వెంకటయ్యపాలెం గ్రామాల్లో ఓంకార్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వైద్యులు సునీల్, ట్రస్టు సభ్యులు, చిత్రడి రాజేష్, మీసాల మహేంద్ర, హనుమంతరావు, శ్రీలత పాల్గొన్నారు.

19,383 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు

● ఏపీఎంఐడీ ప్రాజెక్టు డైరెక్టర్ దుర్గేష్

● ఘనంగా ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవం



గాదరాడలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్

కోరుకొండ, ఆగస్టు 24: జిల్లాలో 19,383 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్ అన్నారు. మండలంలోని గాదరాడ గ్రామంలో శనివారం జిల్లా ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్‌తోట విస్తరణ మహోత్సవం 2024 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ఎంఐడీ డైరెక్టర్ మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో 12,500 ఎకరా ల్లో ఆయిల్‌ఫామ్ తోటలు విస్తరించి ఉన్నాయన్నారు. 3లక్షల టన్నులు ఉత్పత్తి అవుతుంది. 28వేల మంది రైతులు ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నారు. ఒక టన్ను ఆయిల్ పామ్ గెలకు 180 టన్నుల ఆయిల్ దిగుబడి వస్తోంది. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి బత్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవంను గాదరాడ ఓం శివశక్తి పీఠం కల్యాణమండపం వద్ద నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలు అందించారు. రైతులు పంట సాగుచేయడానికి ఆధునిక యంత్రాలు, పరికరాలు పట్ల అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులో యంత్రాల ప్రదర్శన ఎంతగానో ఉప యోగపడిందన్నాయి. ఆయిల్‌ఫామ్ తోటల పెంపకంలో రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక పద్ధతులు అవలంబిస్తు అధిక దిగుబడులు పొందాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి పి.సుజాతకుమారి, పతంజలి ఫుడ్స్ లిమిడెట్ జీఎం పట్టాభిరామిరెడ్డి, డిప్యూటీ జీఎం ఏఎస్ ప్రకాష్, గాదరాడ సర్పంచ్ దూది కాంతారావు, ఎంపీటీసీ బలిరెడ్డి రాజు, ఆయిల్‌పామ్ రైతు సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, ఎం.గంగాధర్, దాసరి తమ్మన్నదొర, పి.గంగబాబు, మండల ఉద్యాన అధికారిణి, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఖాళీ స్థలాలు పార్కులుగా అభివృద్ధి

● కమిషనర్ కేతన్ గార్గ్.. నగరంలో పలు ప్రాంతాల పరిశీలన



ఖాళీస్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 24: రాజమహేంద్రవరంలో కార్పొరేషన్‌కు చెందిన ఖాళీ స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేస్తామని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. శనివారం నగరంలో కార్పొరేషన్ ఖాళీ స్థలాలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాద వాతావరణాన్ని కల్పించడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. నగరంలో పార్కులను అభివృద్ధి చేయడంలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం తీసుకుంటామన్నారు. అలాగే నిర్వహణ బాధ్యతలు వారికి అప్పగిస్తామన్నారు. అందుకు అనుగుణంగా తగిన ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు. గతంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణ వ్యర్థాలు తరలింపు జరిగేదని, అందుకు రుసుము కూడా నిర్ణయించారని, అయితే కొద్ది కాలం నుంచి ఆ ప్రక్రియ జరగడంలేదన్నారు. తిరిగి వ్యర్థాల తొలగింపు కార్యక్రమం చేపడతామన్నారు. నగరంలోని నిర్మాణ వ్యర్థాలను విడదీయడానికి వీరభద్రనగర్‌లో ఉన్న కార్పొరేషన్‌కు చెందిన స్లాటర్ హౌస్‌లో ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. అందుకు తగిన ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ జి.పాండురంగారావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈ మదర్షాఆలీ, డిప్యూటీ సిటీ ప్లానర్ బాలాజీ, ఏఈ, శానిటరీ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి పాల్గొన్నారు.

రైతుకు చేదోడుగా పాడి పరిశ్రమ

● పశువుల ఆసుపత్రి ప్రారంభంలో ఎమ్మెల్యే గోరంట్ల



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, ఆగస్టు 24: రైతు బాగుండాలంటే వ్యవసాయంతోపాటు పాడిపరిశ్రమ కూడా ఉండాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. శనివారం మండలంలోని దుళ్ల పశువుల ఆసుపత్రి, రైతు భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమ రైతుకు ఆదాయ మార్గంలో చేదోడుగా ఉంటుందన్నారు. పశు సంవర్ధకశాఖపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. ప్రభుత్వం పశు సంరక్షణ కోసం అనేక పథకాలు అమలులోకి తీసుకొచ్చిందన్నారు. పశువులకు ఆస్పత్రిలో టీకాలు, మందులు ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని, కొండపల్లి పట్టియ్య, చిట్టూరి అమ్మిరాజు, ముమ్మిడి దేవీ నాగేశ్వరావు, గుర్రపు సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనువాసు, ముద్రగడ జమీ, ప్రత్తిపాటి రామారావుచౌదరి, పాటంశెట్టి రాంజీ, బోడపాటి గోపి, పంతం గణపతి, ఆదిమూలం సాయి, కంటిపూడి శ్రీను, కాయల సత్యనారాయణ, తూము శ్రీను, సూరపురెడ్డి భరత్, మెర్ల అయ్యప్ప, డీఏహెచ్‌వో శ్రీనివాసరావు, డీడీ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో రత్నకుమారి, ఏడీ రవివర్మ, డాక్టర్ శ్రీరామ్, ఏవో ద్వారకాదేవి తదితరులు పాల్గొన్నారు.

వరద ఫౌండేషన్ సేవలు అభినందనీయం

● డీఈవో వాసుదేవరావు



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న పులిచింతల ప్రాజెక్టు సబ్ కలెక్టర్ వరదా సుబ్బారావు, డీఈవో వాసుదేవరావు, తహసీల్దారు పోశియ్య

కడియం, ఆగస్టు 24: పులిచింతల ప్రాజెక్టు సబ్‌కలెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న కడియం హైస్కూల్ పూర్వ విద్యార్థి వరదా సుబ్బారావు సేవలు అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు అన్నారు. వరదా సుబ్బారావు కడియం ఉన్నత పాఠశాలకు విచ్చేసి గత ఏడాది పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 17మంది విద్యార్థులకు రూ.2వేలు, రూ.1500 చొప్పున, 6 నుంచి 9 తరగతిలో ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించిన 8 మంది విద్యార్థులకు రూ.1500, రూ. వెయ్యిచొప్పున మొత్తం 25 మంది ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. వరదా దుర్గారావు, లక్ష్మి, కమల, తహసీల్దారు పోశియ్య, హెచ్‌ఎం టి.సత్యనారాయణ, స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, ఎంపీడీవో కె.రత్నకుమారి,ఉపాధ్యాయులు పి.శ్రీనివాస్, చంద్రశేఖరరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

మానవ జీవితం ఆధ్యాత్మికతతో ముడిపడి ఉంది

● హైకోర్టు న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డి



రామవరంలో రాటమంచి కార్యక్రమం నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయవాది శివారెడ్డి

అనపర్తి, ఆగస్టు 24 : మానవ జీవితం ఆధ్యాత్మిక చింతనతో ముడిపడి ఉందని ప్రతిఒక్కరూ దైవ కార్యక్రమాలకు కొంత సమయం కేటాయించాలని హైకోర్టు న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డి అన్నారు. రామవరంలోని పంచాయతీ సమీపంలో నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాలకు శనివారం ఆయన రాట మంచి కార్యక్రమం నిర్వహించి ఉత్సవ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 56 సంవత్సరాలుగా ఇక్కడ గణపతి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని కమిటీ నిర్వాహకులను అభినందించారు. ముందుగా పురోహితుడు చైతన్య ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించిన శివారెడ్డి రాట మంచి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి (చిన్నబ్బు), నల్లమిల్లి వెంకటరెడ్డి, చింతా సురేష్‌రెడ్డి, తేనెల శ్రీనివాస్, కొవ్వూరి వీర్రాఘవరెడ్డి, ద్వారంపూడి రాంబాబు, నల్లమిల్లి రామచంద్రారెడ్డి, మల్లిడి సురేంద్రరెడ్డి, నల మిల్లి సుబ్బారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దు

● అవగాహనా సదస్సులో సీఐ శివగణేష్



అనపర్తిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శివగణేష్, ఎస్ఐ శ్రీనునాయక్

అనపర్తి, ఆగస్టు 24: రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగు తున్నాయని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుంటే జీవితాలు ఛిద్రమవుతాయని, వీటిపై అవగాహన పెంపొందించుకుని పది మందికి తెలియజేయాల్సిన అవసరం విద్యార్థులపై ఉందని అనపర్తి సీఐ శివగణేష్ ఎస్ఐ శ్రీనునాయక్ అన్నారు. శనివారం అనపర్తిలోని ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో సీఐ, ఎస్ఐలు పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఫోన్లకు వచ్చిన ఓటీపీ నెంబర్లను ఇతరులకు షేర్ చేయరాదని, తెలియని సైట్లను ఓపెన్ చేయవద్దని సూచించారు. ఇటీవల ఆన్‌లైన్ లోన్ల వలలో చిక్కుకుని అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ తాడి సతీష్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ధవళేశ్వరం, ఆగస్టు 24: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిసగా మారితే ఆ అలవాటు జీవితాన్ని చిత్తు చేస్తుందని ధవళేశ్వరం సీఐ టి.గణేష్ అన్నారు .శనివారం స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలోనే తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు కష్టపడాలని సూచించారు. తాత్కాలిక ఆనందాల కోసం వెంపర్లు ఆడితే జీవనం నాశనం అవుతుందన్నారు. విద్యార్థులు మంచి భవిష్యత్‌ను నిర్దేశించుకుని భావిభారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



దివ్య విద్యాసంస్థల్లో చిన్నారుల ప్రదర్శనలు

రాజమహేంద్రవరంలో విద్యుద్దీపాలంకరణలో ఇస్కాన్ మందిరం



ఇస్కాన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ఇస్కాన్‌లో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరంకల్చరల్, ఆగస్టు 24: స్థానిక ఇస్కాన్ మందిరంలో జరుగుతున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఆరోరోజుకు చేరాయి. ఈ సందర్భంగా విశ్వశాంతి మహాయజ్ఞం, శ్రీకృష్ణ లీలా కథామృత ప్రవచనం, రాధాకృష్ణుల వాహన సేవ, బాలలతో కూచిపూడి నృత్యాలు, స్వామి పవళింపు సేవ జరిగాయి. భక్తుల దర్శనానికి ఇబ్బందులు లేకుండా మందిర కమిటీ చైర్మన్ శివానంద నిమాయిదాస్, సభ్యులు శ్యామంగ శ్రీనివాస్, రవీంద్ర చక్రదాస్, హేమా నిమాయిదాస్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

రాజానగరం: శ్రీకృష్ణాష్టమి వేడుకలను రాజానగరంలోని దివ్యా విద్యా సంస్థల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల ప్రదర్శనలు అందరినీ అబ్బురపరిచాయి. పాఠశాల చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో పాటు ఉట్టుకొట్టే వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో చైర్మన్ బర్ల సత్యనారాయణ, సెక్రటరీ అండ కరస్పాండెంట్ సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని కృష్ణాష్టమి వేడుకలు, చిన్నారుల వేషధారణలను తిలకించారు.

దివాన్‌చెరువు : నామవరంలోని భారతీయ విద్యాభవన్స్‌లో కృష్ణాష్టమి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ వీరేంద్రనాద్ కృష్ణతత్వాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు రాధాకృష్ణుల నృత్యాలతో అలరించారు. చిన్నారులు ధరించిన గోపీకృష్ణుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

గోదావరి స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు ఇవ్వాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24: రాజమహేంద్రవరంలోని గోదావరి రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు ఇవ్వాలని పలువురు నాయకులు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని కోరారు. ఈ మేరకు శనివారం గోదావరి రైల్వేస్టేషన్ అడ్వైజరీ కమిటీ నాయకులు ఎం.కృష్ణమాచార్యులు, తంగెళ్ల శ్రీనివాసరావు, పైబోయిన సురేంద్రకుమార్, కారుమూరి సురేష్, కళ్లకూరి శ్రీనివాసరావు తదితరులు ఎంపీకి ఒక వినతిపత్రం అందజేశారు. కరోనా తర్వాత గోదావరి స్టేషన్‌లో రైళ్లకు పూర్తిగా హాల్టు నిలిపివేయడంతో స్టేషన్ అభివృద్ధికి నోచుకోవడంలేదన్నారు. చిన్న వ్యాపారులు, ఆటోవాలాలు, రైల్వే కూలీలు తదితర అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వచ్చే ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ గోదావరి స్టేషన్ మీదుగానే వెళతాయని, వీటికి గోదావరి స్టేషన్‌లో హాల్టు ఇస్తే మళ్లీ పూర్వ వైభవం వస్తుందని వివరించారు. అలాగే గోదావరి స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేయాలని వారు కోరారు.

8 నుంచి నేషనల్ మెగా బ్యాడ్మింటన్ ఈవెంట్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24 : రాజమహేంద్రవరంలో సెప్టెంబరు 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ నేషనల్ మెగా బ్యాడ్మింటన్-2024 ఈవెంట్ జరుగుతుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక నారాయణపురంలోని ఆర్‌ఎంసీ ఇండోర్ షటిల్ కోర్టులో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్యాడ్మింటన్ ఈవెంట్‌కు సుమారు 150 మంది వరకూ జాతీయ క్రీడాకారులు వస్తున్నారని, టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు, రాష్ట్ర మంత్రులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈవెంట్ సక్సెస్ చేయడానికి ఆర్గనైజింగ్ కమిటీని కూడా వేశామని, అందరూ బాధ్యతగా భావించి విజయవంతం చేయాలని కోరారు. 2027లో ఏపీలో నేషనల్ గేమ్స్ నిర్వహించడానికి కసరత్తు చేస్తున్నామన్నారు. రాజమహేంద్రవరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ అంకం చౌదరి, ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణల బాధితులంతా 28న విజయవాడ తరలిరండి: సీపీఐ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24: వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలు, భూ దందాల బాధితులంతా ఈనెల 28న విజయవాడ సీపీఐ కార్యాలయానికి రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో భూ బాధితుల రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల ధరలు బాగా పెరిగినందున అనేక ప్రాంతాల్లో భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. దొంగ పట్టాలు పుట్టించి వందల ఎకరాల భూమిని కాజేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనకు 29న యూత్ ఫెస్టివల్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై యువతలో అవగాహన కల్పించడానికి ఈనెల 29న యూత్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర శనివారం ఓ ప్రకటన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు, మార్గదర్శకాలతో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈ ఫెస్టివల్ జరుగుతుందని వెల్లడించారు. ఇందులో భాగంగా 29న డిగ్రీ చదువుతున్న విద్యార్థులు, ట్రాన్స్‌జెండర్లతో 5కే రన్ నిర్వహిస్తున్నామని, ఉదయం 6.30 గంటలకు రాజమహేంద్రవరం వై.జంక్షన్ నుంచి గోదావరి తీరాన ఉన్న ఇస్కాన్ టెంపుల్ వరకు ఐదు కిలోమీటర్ల మారథాన్ ఉంటుందని తెలిపారు. అలాగే ప్రభుత్వ స్కూళ్లలో 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 29వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ శాఖాధికారి కార్యాలయంలో జిల్లాస్థాయి క్విజ్ నిర్వహిస్తారన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారని వసుంధర చెప్పారు.

'పరిశ్రమల్లో ఆకస్మిక తనిఖీ చేయాలి'

దివాన్‌చెరువు, ఆగస్టు 24 : రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలపై వెంటనే ఆకస్మిక తనిఖీలు చేయాలని టీఎన్‌టీయూసీ జిల్లా అధికారప్రతినిధి దాసరి శ్రీనివాసరావు కోరారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. గతంలో ఎల్జీపాలిమర్స్ ప్రమాదం జరిగినప్పటికీ దాని నుంచి ఎటువంటి పాఠం నేర్చుకోకుండా గత వైసీపీ ప్రభుత్వం పరిశ్రమలపై తనిఖీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. దానివల్లే కొన్ని పరిశ్రమలలో ప్రమాదాలు చోటుచేసుకుని కార్మికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందన్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఎసెన్షియా పరిశ్రమలో ఇటీవల జరిగిన దురదృష్టకర సంఘటన దృష్టిలో ఉంచుకుని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తరచూ ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు.

కనపడకుండాపోయిన పశువుల కాపరి మృతి

గోకవరం, ఆగస్టు24: మండలంలోని కామరాజుపేట గ్రామా నికి చెందిన జట్ల తాసు(55) అనే వ్యక్తి ఈనెల 20న పశువులను మేపేందుకు బయటకు వెళ్లాడు. తాసు ఇంటికి రాకపోవడంతో గత మూడు రోజులుగా కుటుంబసభ్యులు తాసు ఆచూకీ కోసం వెతికారు. ఈక్రమంలో ఈనెల 23న గ్రామ శివారునగల బ్రిడ్జి కింద తాసు మృతదేహాన్ని కొంతమంది పశు కాపరులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జరిగిన సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

కుతుకులూరులో ఏడుగురు జూదరుల అరెస్టు

● రూ.20వేలు స్వాధీనం

అనపర్తి, ఆగస్టు 24 : అనపర్తి మండలం కుతుకులూరులో పేకాట శిబిరంపై అనపర్తి పోలీసులు దాడిచేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ తెలిపారు. కుతుకులూరు శివార్లలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించగా పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.20,520 స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపారు.

ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల చట్టాలపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 24: జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక హాలులో వ్యవసాయశాఖ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు చట్టాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. శనివారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రైతాంగానికి అవసరమైన ఉత్పాదకాల పంపిణీ, అమ్మకంలో నాణ్యతలో రాజీపడకుండా చట్టం అమలు చేయాలన్నారు. చట్టం విధివిధానాలు, తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్, ఏడీఏ కర్నూల్ శ్రీవెంకటేశ్వర్లు, కమిషనర్ కార్యాలయం ఏడీఏ రాజశేఖర్, అమలాపురం, జిల్లాలోని ఏడీఏలు, ఎంఏవోలు పాల్గొన్నారు.

కోదాడలో కృష్ణునిపాలెం వాసి మృతి

గోకవరం, ఆగస్టు 24: గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామానికి చెందిన మలిరెడ్డి శ్రీనివాసరావు తెలంగాణా రాష్ట్రం సూర్యారావుపేట జిల్లా కోదాడ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. హైదరాబాద్‌లో ఉన్న కుమార్తె, అల్లుడిని చూసేందుకు శ్రీనివాసరావు(55) ఇటీవల హైదరాబాద్ వెళ్లాడు. రాజమహేంద్రవరంలో బంధువుల గృహ ప్రవేశం కోసం కుమార్తె, అల్లుడితో కలిసి శ్రీనివాసరావు కారులో శనివారం తెల్లవారుజామున బయలుదేరారు. మార్గమధ్యలో కోదాడ వద్ద కారు ఆపి శ్రీనివాసరావు రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడు శ్రీనివాసరావు కోరుకొండ మండలం శ్రీరంగపట్నం సొసైటీ సీఈవోగా గతకొంతకాలం పనిచేశారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


గోకవరం ఆసుపత్రిలో జ్వరపీడితులు

ఇసుక రవాణాకు 134 వాహనాలు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 24 : జిల్లాలో ఇసుక రవాణాకు డీటీసీ ద్వారా 134 వాహనాలకు అనుమతి ఇచ్చినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం రాజమహేంద్రవరం, కొవ్వూరు ఆర్‌డీవోలు, మైన్స్, ఇరిగేషన్ తదితర అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉచిత ఇసుక రవాణాలో అధిక చార్జీలు వసూళ్లను నియంత్రించాలన్నారు. జిల్లాలో ఇసుక రవాణా చేసే వాహనాలను గుర్తించి ధ్రువీకరించే అధికారం జిల్లా రవాణా అధికారులదే అన్నారు. వారి ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలను అనుమతించడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటి వరకు 134 లారీలు జిల్లాలో వాటి వివరాలు నమోదు చేసుకున్నట్టు తెలిపారు.రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటి జాబితా, ఆయా వాహనాల నుంచి వసూలు చేయాల్సిన రవాణా చార్జీలు నిర్ధారించిన ధరల పట్టిక ఇచ్చామన్నారు. ఇతర జిల్లాల నుంచి వస్తున్న వాహనాల జాబితా ఆధారంగా వాటిని అనుమతించడం,ఆ మేరకు రవాణా చార్జీలు చెల్లింపులు సేకరించాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ కూడా వారి ఐచ్ఛికత మేరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాల నుంచి జిల్లాలో నిర్ధేశించిన రవాణా చార్జీలను అనుసరించాల్సి ఉంటుందన్నారు.


కెనాల్‌లో బోట్ షికార్ ఏర్పాటుపై కడియపులంక వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పర్యాటక ప్రతిపాదనలు సిద్ధం చేయండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

కడియం, ఆగస్టు 24: జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధి ప్రణాళికలో భాగంగా పొట్టిలంక నుంచి కడియపులంక వరకు కెనాల్‌లో బోట్ విహారం చేసే విధానంలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. పర్యాటక శాఖ అధికారులతో కలిసి కడియం మండలంలో శనివారం కలెక్టర్ ప్రశాంతి పర్యటించారు. కలెక్టర్ ప్రశాంతి , జిల్లా పర్యాటక శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ తగిన ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ఇటీవల ఎకో టూరిజంపై మంత్రి కందుల దుర్గేష్, కడియం నర్సరీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారన్నారు. పొట్టిలంక నుంచి కడియపులంక వరకు బోటింగ్‌కు అనుగుణంగా ప్రతిపాదనలను, డీపీఆర్‌ను సిద్ధం చేయాలన్నారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు ముందుగానే ఈ ప్రాంతంలో పర్యాటకంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాల్సి ఉందన్నారు.కార్యక్రమంలో పర్యాటకశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వి.స్వామినాయుడు, జిల్లా టూరిజం అధికారి పి.వెంకటాచలం, తహశీల్దార్ కె.పోశిబాబు, ఎంపీడీవో కె.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

జ్వరమొచ్చింది!


రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న రోగులు
కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న బాలుడు

జిల్లాను పీడిస్తున్న ఫీవర్లు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24 : జిల్లాకు జ్వరమొచ్చింది.ఎక్కడ చూసినా జ్వరపీడితులే. పిల్లలు,పెద్దలు అందరూ జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామాల్లో అనేక కుటుంబాల్లో ఇద్దరు, ముగ్గురు జ్వరాల బారి నపడుతున్నారు. వర్షాకాలం,వాతావరణంలో భిన్నమైన పరిస్థితులు నెలకొనడంతో జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. డెంగీ జ్వరాలు ప్రజలను పీడిస్తున్నాయి.బాధితులకు ప్లేట్‌లెట్లు సడన్‌గా పడిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది.మరోపక్క సీజనల్ వైరల్ ఫీవర్లు ప్రజలపై దాడి చేస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియాతో పాటు సాధారణ ఫ్లూ, ఇన్‌ఫ్లుయెంజా కూడా విజృంభిస్తున్నాయి. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం తల్లడిల్లిపోతున్నారు. జలుబు, గొంతులో కఫం, విపరీతమైన తలనొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వరం వంటి లక్షణాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రెండు, మూడు రోజులు కాదు ఏకంగా వారం, పది రోజుల పాటు ఇవే లక్షణాలు కనిపిస్తుండడంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో వైద్యం కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు జ్వరపీడితులు క్యూ కడుతున్నారు. ఆసుపత్రుల వద్ద బారులు తీరుతున్నారు. కేవలం జ్వరం నుంచి బయటపడటానికి మందులు, టెస్టులకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.జిల్లాలో ప్రధాన ఆసుప త్రులతో పాటు పీహెచ్‌సీలు,అర్బన్ హెల్త్ సెంటర్లలో కూడా ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. చాలా మంది గ్రామస్తులు ఆర్ఎంపీ, పీఎంపీలతో వైద్యం చేయించుకుంటున్నారు. కొంతమంది మెడికల్ షాపుల వద్దే మందులు తెచ్చుకుని వాడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రికి వెళితే సుమారు రూ.5 వేలు ఉండాల్సిందే. దీంతో సామాన్యులు అటువైపు చూసే ధైర్యం చేయడంలేదు. జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకూ 28 డెంగీ కేసులు నమోదయ్యాయి. మలేరియా కేసు ఒకటే నమోదైందని చెబుతున్నారు. వాస్తవంగా చాలా చోట్ల ఇటు వంటి కేసులు నమోదవుతున్నాయి. నల్లజర్ల మండలం పోతవరంలో ఇటీవల రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి.

కొవ్వూరులో జ్వరాల విజృంభణ

కొవ్వూరు, ఆగస్టు 22: వర్షాకాలం కావడంతో కొవ్వూరు పట్టణం, పరిసర గ్రామాల్లో గత 20 రోజులుగా సీజనల్ వ్యాధుల వ్యాప్తి పెరిగింది. అపారిశుధ్యం, వాతావరణ పరిస్థితుల కారణంగా టైఫాయిడ్, మలేరియా, డెంగీ కేసులు ప్రబలడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి ప్రతి రోజు 200 మందికిపైగా జ్వర బాధితులు వస్తున్నారని ఆసుపత్రి లెక్కలు చెబుతున్నాయి. సుమారు 75 నుంచి 100 మందికి ప్రతిరోజు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తపరీక్షలు చేస్తున్నారు. ఇక్కడే కాకుండా పీహెచ్‌సీలు, ఆర్ఎంపీలు, ప్రైవేటు ఆసుపత్రుల్లో వందలాది మంది జ్వరాలతో చికిత్స పొందుతున్నారు. దోమల నివారణ చర్యలతో పాటు దోమ తెరలు వాడాలని వైద్యులు సూచిస్తున్నారు.

గోపాలపురాన జ్వరపీడితులు..

గోపాలపురం, ఆగస్టు 24 : గ్రామగ్రామాన జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. అయితే పేదలకు ఆ స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. నియోజకవర్గ ముఖ్య కేంద్రంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం స్థాయిని పెంచినప్పటికీ పడకలను ఆ స్థాయిలో పెంచకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పూర్వం ఆరు పడకలకే పరిమితమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న గోపాలపురం ప్రభుత్వాసుపత్రి 2017లో నాటి సీఎం నారా చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌గా నామకరణం చేసి 30 పడకలకు పెంచారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ఇదే ప్రధాన ఆసుపత్రి.. గత ప్రభుత్వం ఆసుపత్రిని పట్టించుకోకపోవడంతో వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. నియోజకవర్గ పరిధిలో ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నా అక్కడా సేవలు అంతంతమాత్రమే. గోపాలపురం నియోజకవర్గ ప్రజలకు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోగులతో ఆసుపత్రులు కిటకిట..

రాజానగరం/దివాన్‌చెరువు/కడియం,ఆగస్టు 24 : రాజానగరం మండలంలో కూడా జ్వరపీడితుల సంఖ్య పెరిగింది. ఆసుపత్రులన్నీ రోగులతో నిండిపోతున్నాయి.రాజా నగరం పీహెచ్‌సీలో రోజుకు 60-80 వరకు రోగులు వస్తు న్నారు. వారిలో జ్వర పీడితులే ఎక్కువ. పాలచర్ల పీహెచ్‌సీలో ఆసుపత్రికి వచ్చే అవుట్ పేషెంట్లలో దాదాపు సగం మంది దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, జ్వరం వంటి లక్షణాలతో బాధపడుతున్నారు. మరికొంత మందికి కీళ్ల నొప్పులు వస్తున్నాయి. కడియం మండలంలోనూ జ్వరాలతో వందలాది మంది బాధపడుతున్నారు.ఒక్క కడియం పీహెచ్‌సీలోనే రోకు సుమారు 50 కేసులు నమోదవుతున్నాయి. ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో, ఆర్ఎంపీల వద్ద వైద్యం పొందుతున్న వారూ ఎక్కువే.

అనపర్తి ఆసుపత్రికి రోజూ 50 మంది..

అనపర్తి, ఆగస్టు 22: అనపర్తి ఏరియా ఆసుపత్రికి ప్రతి రోజు సుమారు 50 మంది వరకు జ్వర పీడితులే వస్తున్నారు. ఏరియా ఆసుపత్రిలో సగం పైగా జ్వరాలతో చికిత్స పొందుతున్న రోగులే కనిపిస్తున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డిని ప్రశ్నించగా ఈ ఏడాది జ్వర పీడితుల సంఖ్య పెరగడం వాస్తవమేనని వాతావరణ పరిస్థితుల ప్రభావంతో జ్వరాల తీవ్రత పెరిగిందన్నారు. ఆసుపత్రిలో జ్వర పీడితులకు అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని, జ్వర పీడితులు రెండు మూడు రోజుల్లో కోలుకుంటున్నారన్నారు.రోజుకు సుమారు 30 నుంచి 40 మంది వరకు కొత్త పేషెంట్లు వస్తున్నారని తెలిపారు.

డెంగీతో ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ

డెంగీ జ్వరాలతో బాధపడుతున్న వారిలో ఎక్కువ మంది ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. డెంగీలో ప్రధానంగా ప్లేట్‌లెట్ కౌంట్ పర్యవేక్షణ అత్యంత కీలకం..దీంతో బాధితులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లిపోతున్నారు. ప్రైవేటు వైద్యులు ఇదే అదునుగా వేలు.. లక్షలు లాగేస్తున్నారు. జ్వరం ఉందని వెళితే రూ.5 వేల వరకూ ఖర్చవుతుందని బాధితులు వాపోతున్నారు. వైరల్ ఫీవర్లతో పాటు టైఫాయిడ్, మలేరియా లక్షణాలతోనూ ఆసుపత్రులకు వస్తున్నవారి సంఖ్య ఎక్కువగానే ఉందని చెబుతున్నారు. ఇటీవల కొద్దిరోజులుగా వాతావరణంలో విపరీతమైన మార్పులు కనిపిస్తున్నాయి. ఎండలు, ఉక్కపోత అంతలోనే వర్షం కురవడం వంటి భిన్నమైన వాతావరణం వైరల్ ఫీవర్లు, ఇతర జ్వరాలకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. అలాగే, కలుషిత నీరు టైఫాయిడ్ వంటి జ్వరాలకు మూలంగా పేర్కొంటున్నారు.


ఆసుపత్రిలో జ్వరపీడితులు

జీజీహెచ్ వైద్యులకు పట్టదా!

జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, పల్లెలు అనే తేడాలేకుండా వైరల్ ఫీవర్లు, డెంగీ జ్వరాలు ప్రజలను పట్టి పీడిస్తుంటే రాజమహేంద్రవరం జీజీహెచ్ వైద్యాధికారులు మాత్రం అబ్బే పెద్దగా జ్వరాలేమీ లేవని చెప్పడం విమర్శలకు దారితీస్తోంది. ఒక పక్క ప్రైవేట్ ఆసుపత్రులు, ఆర్ఎంపీ క్లినిక్‌ల్లో ఫీవర్ బాధితులతో కిటకిటలాడుతుంటే ఇక్కడి పెద్దాసుపత్రి వైద్యులు మాత్రం జ్వరపీడితుల వివరాలు చూపించడంలో అయోమయం ప్రదర్శించడం చర్చనీయాంశంగా మారింది. వైరల్, డెంగీ వంటి జ్వరాలతో బాధితులు ప్రైవేట్ ఆసుపత్రులకు పోటెత్తుతున్నా జిల్లా సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో మాత్రం జ్వరపీడితులకు సంబంధించి జనరల్ మెడిసిన్ వైద్య విభాగం ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడం ప్రశ్నార్థకంగా మారింది.

గోకవరంలో పెరుగుతున్న కేసులు

గోకవరం, ఆగస్టు 24 : గోకవరం మండలంలో జ్వరాలు వణి కిస్తున్నాయి. మలేరియా,టైఫాయిడ్, ప్లేట్‌లేట్స్ తగ్గడం, రొంప,ఒంటి నొప్పులు,దగ్గు,తదితర రోగాలు పట్టిపీడిస్తు న్నాయి. పిల్లలు, పెద్దలు, వృద్ధులు అనే తేడా లేకుండా మంచాన పడుతున్నారు. గోకవరం ప్రభుత్వాసుపత్రితో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల వద్ద జ్వరపీడితులు క్యూకడుతున్నారు. మరికొంత మంది ఆర్ఎంపీలను ఆశ్రయించి ఇళ్ల వద్దే చికిత్స పొందుతున్నారు. బాగా నీరసి ంచిన చాలా మంది రోగులు రాజమహేంద్రవరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.గోకవరం ప్రభుత్వాసు పత్రి కి వచ్చే రోగుల సంఖ్యను పరిశీలిస్తే ఈ నెల 20న 417 ఓపీ ఉం డగా,21న 227 ఓపీ ఉంది.తాజాగా గురువారం 260 మంది కిపైగా రోగులు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ ప్రభు త్వాసుపత్రిని ఆశ్రయించారు.రోగుల్లో సగానికి పైగా జ్వరాలు,విరేచనాలు, రొంప, కీళ్ల నొప్పులతో వస్తున్నవారే కనిపిస్తున్నారు.

- పెరుగుతున్న డెంగీ, వైరల్ జ్వరాలు
- ఒక్కో ఇంట్లో మూడు నాలుగు కేసులు
- ప్రైవేటు ఆసుపత్రులకు పరుగు
- జేబు ఖాళీ చేస్తున్న వైద్యులు
- సీహెచ్‌సీలలో రోజుకు 50 కేసులు
- గోకవరంలో 200 దాటుతున్నాయ్
- అయినా కదలిక లేని వైద్య సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న రోగులు

జ్వరం వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి..



తగు జాగ్రత్తలు తీసుకుంటే ఉపశమనం పొందవచ్చు.ఈ సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రజలంతా కాచి చల్లార్చిన నీటినే తాగాలి. మాంసాహారాలకు దూరంగా ఉండాలి. మితాహారం తినాలి. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే మలేరియా, డెంగీ వ్యాధులను అరికట్టవచ్చు.
- గట్టి రామభాస్కర్, రాజానగరం పీహెచ్‌సీ వైద్యాధికారి

50 వేలకు ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గకూడదు..



ప్రస్తుతం పలువురిలో జ్వరాల లక్షణాలు ఉన్నాయి. దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణంగా 4 లక్షల ప్లేట్‌లెట్స్ కౌంట్ ఉండాలి.. 2,50,000 కౌంట్ తగ్గకూడదు. 50 వేలకు పడిపోతే వైద్యులను సంప్రదించాలి. కాచి చల్లార్చిన నీరు తాగాలి. వేడి ఆహారం తీసుకోవాలి. గుండె జబ్బులు, బీపీ ఉన్నవారు జ్వరాల లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- డా. శివశంకర్ , కడియం సీహెచ్‌సీ వైద్యాధికారి


అనపర్తి ఆసుపత్రిలో నిండుగా బెడ్‌లు



బదిలీలకు.. ఓకే!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

- సాధారణ ఉద్యోగులకు గ్రీన్‌సిగ్నల్
- తొలుత ఉన్నతాధికారుల బదిలీ
- ఇప్పుడు మిగతా ఉద్యోగుల వంతు
- 19 నుంచి మొదలైన సందడి
- అన్ని డిపార్ట్‌మెంట్లకు అవకాశం
- 27 వరకూ దరఖాస్తుల స్వీకరణ
- సచివాలయ ఉద్యోగులకు ఛాన్స్
- ఎమ్మెల్యేల సిఫారసులకు క్యూ
- 31వ తేదీన పోస్టింగ్‌లు

ప్రభుత్వ ఉద్యోగుల్లో బదిలీ సందడి నెలకొంది. ఈ నెల 19వ తేదీ నుంచి సందడి మొదలైంది.ఈ నెల 31వ తేదీ లోపు బదిలీల ప్రక్రియపూర్తి కావాలని ప్రభుత్వం గడువు విధించింది. చాలా కాలం తర్వాత సాధారణ బదిలీలు జరుగుతున్నాయి. జిల్లాలో అన్ని డిపార్ట్‌మెంట్ల ఉద్యోగులు తాము కోరుకున్న ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. సీఎం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదట కలెక్టర్, ఎస్పీ, జేసీ వంటి ప్రధాన బదిలీలు జరిగిన సంగతి తెలిసిందే. డీఎస్పీలు, ఆర్డీలు, సీఐలు, తహశీల్దార్ల బదిలీలు ఇప్పటికే చాలా వరకూ పూర్తయ్యాయి. ప్రస్తుతం వివిధ శాఖల్లో కింది స్థాయి ఉద్యోగి వరకూ బదిలీ జరగనుంది. కేవలం జైళ్ల శాఖకు మాత్రం బదిలీలు లేవు. ఇక జిల్లాలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, సివిల్ సప్లయిస్, మైనింగ్ అండ్ జియాలజీ, అన్ని విభాగాలకు చెందిన ఇంజనీరింగ్ స్టాఫ్, ఎండోమెంట్, ట్రాన్స్‌పోర్ట్ ,ఇఎఫ్అండ్‌టీ, ఇండస్ట్రీస్, ఎనర్జీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, కమర్షియల్ టాక్సెస్, ఎక్సయిజ్ శాఖల్లో బదిలీలు జరగనున్నారు.ఈ మేరకు చాలా విభాగాల ఉద్యోగులు ఎమ్మెల్యేల సిఫార్స్ లేఖలు తీసుకుంటున్నారు.ఎవరికి వారు ఇష్టమైన చోట పోస్టు కొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎవరి దారులు వారు వెతుకుంటున్నారు. ఎమ్మెల్యేలు లెటర్లు ఇవ్వకపోతే ఇతర మార్గాలపై దృష్టిపెడుతున్నారు.

27వ తేదీ వరకూ అవకాశం..

ఈ నెల 27వ తేదీ లోపు అన్ని డిపార్ట్‌మెంట్ల ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఉండాలి. 31వ తేదీలోపు వారికి పోస్టింగ్‌లు ఇస్తారు. ఇంజనీరింగ్ విభాగంలో చాలా మంది ఇంజనీర్లు బదిలీ కానున్నారు. ఐదేళ్లు దాటిన వారంతా బదిలీ అవుతారు. మునిసిపాలిటీలో మాత్రం ఎక్కడి వారు అక్కడే ఉండిపోయేలా ప్రయత్నిస్తున్నారు. చిన్న స్థాయి నుంచి మంత్రుల వరకూ జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఎవరు అందుబాటులో ఉంటే వారితో సిఫార్స్ చేయించుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా డబ్బు ప్రధాన భూమిక పోషిస్తున్న సంగతి తెలిసిందే.

సచివాలయ ఉద్యోగులకు ఇలా..

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఐదేళ్లు నిండితేనే బదిలీ. రిక్వెస్ట్ బదిలీలు ఉన్నాయి.కానీ ఇవన్నీ ఉమ్మడి జిల్లాల పరిధిలోనే జరుగుతున్నాయి.సచివాలయాలకు సంబంధించి పంచాయతీరాజ్ రూరల్ డెవలమెంట్,అందు లోని ఇంజనీరింగ్ విభాగం,యానిమల్ హజ్బెండరీ, ఫిషరీష్, హోంలకు చెందిన ఉద్యోగులను ఉమ్మడి జిల్లా కలెక్టర్ బదిలీ చేస్తారు.మెడికల్ అండ్ హెల్త్‌కు సంబం ధించి డీఎంహెచ్‌వో బదిలీ చేస్తారు. మ్యూచువల్ ట్రాన్స్ ఫర్లు ఉన్నట్టు చెబుతున్నారు.అంతరజిల్లాల బదిలీల విష యంలో ఆన్‌లైన్ దరఖాస్తు అవకాశం లేదు. మాన్యు వల్ గా ఆయా ఉమ్మడి జిల్లాల కలెక్టర్లకు దరఖాస్తు చేస్తే వాటిని పరిశీలిస్తారు. ఈ విధంగా ప్రస్తుతం జిల్లాలో బదిలీ సందడి నెలకొంది.

పిల్లల వైద్యానికి డీఈఐసీ

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24 : పుట్టుక నుంచి 18 ఏళ్లలోపు వయస్సు వారికి అన్ని రకాల లోపాలు, వ్యాధులు, కౌమార దశ బాలికల సమస్యలకు జిల్లా సత్వర చికిత్స కేంద్రం (డీఈఐసీ) ద్వారా వైద్యసేవలు అందజేయడం జరుగుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు వెల్లడించారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో శనివారం వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డీఈఐసీ, జిల్లా జాతీయ హెల్త్‌మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా నాలుగు ప్రధాన లోపాలతో బాధపడుతున్న పిల్లలకు డీఈఐసీలో చికిత్స అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏహెచ్, జీజీహెచ్ తదితర డెలివరీ పాయింట్లలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందికి మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. డీఈఐసీలో వైద్య నిపుణులందరూ అందుబాటులో ఉంటారని, పిల్లల్లో వచ్చే లోపాలను, వ్యాధులను ముందుగానే గుర్తించి వారికి డీఈఐసీ ద్వారా వైద్యసేవలు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌పీఎస్ పోగ్రాం అధికారి డాక్టర్ హరిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

48 గంటల్లో ధాన్యం సొమ్ములు : జేసీ

చాగల్లు, ఆగస్టు 24 : కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ చినరాముడు అన్నారు. మండలంలోని నెలటూరి రైతు సేవా కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. పౌరసరఫరాల, మార్కెటింగ్, రెవెన్యూ అధికారులతో కలసి ధాన్యం కొనుగోళ్ల కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ముందస్తుగా జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, అనుబంధ పరికరరాలు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట పౌరసరఫరాల మేనేజర్ పి.రాధిక, మార్కెటింగ్ ఏడీ ఎం.సునీల్ విజయ్ ఉన్నారు.

మెడికల్ లీవ్ పెట్టేందుకు వెళ్లి ఉపాధ్యాయురాలి దుర్మరణం
నిడదవోలులో విరిగిన రైల్వే గేట్ గంట పాటు స్తంభించిన ట్రాఫిక్
గణపతి ఉత్సవాల ఏర్పాట్లకు అనుమతులు తప్పనిసరి 8



పోలీస్ సారూ.. మారదా తీరు!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

- ఇంకనూ ఫ్యాన్ కిందనే పని
- కూటమి వచ్చినా వైసీపీ వాసనే
- ఆ పార్టీ నేతలకే రెడ్ కార్పెట్
- గతం మాదిరిగానే దందాలు
- స్టేషన్లలోనే సెటిల్‌మెంట్లు
- కూటమి నేతలు దృష్టిపెట్టాల్సిందే

కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు దాటింది. అయినా కొందరు అధికారుల్లో ఫ్యాను సమయంలో ఉన్న అలసత్వం పోవడం లేదు. లోపాయికారిగా వైసీపీ వైపు మొగ్గు చూపుతున్నారనే చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో రెండు నెలలు వేచి చూసినా బాధ్యత, జవాబుదారీతనం లేకుండా విధులు నిర్వర్తిస్తుండడం చూసి కూటమి పాలకులకు చిర్రెత్తుకొస్తోంది. జిల్లాలోని చాలా పోలీస్ స్టేషన్లలో ఇంకా వైసీపీ వాసనే వస్తోంది. జగన్ జమానాలో పోలీసులను రాజకీయ కక్ష సాధింపునకు విపరీతంగా వాడుకొన్న మాట జగమెరిగిన సత్యం. ఆ ఐదేళ్లలో ఠాణాలు సెటిల్‌మెంట్ కేంద్రాలుగా మారిపోయాయి. పాలకులే గడ్డి కరుస్తుండడం..అక్రమాలకు వత్తాసు పలకడంతో అధికారుల అమ్యామ్యాల పనిసులభంగా అయిపోయేది. స్టేషనుకు బాధ్యులుగా ఉండే సీఐ,ఎస్ఐలను కావాల్సి వాళ్లను సీట్లలో కూర్చోబెట్టుకోవడంతో దందాలకు అడ్డూ అదుపూ ఉండేది కాదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చినా చాలా మంది అధికారులు దందాల పంథా మార్చుకోవడం లేదు. ఐదేళ్లు మరిచిపోయిన జవాబుదారీతనాన్ని ఇప్పుడు తగిలించుకొని మామూళ్లను మామూలుగా వదులుకోవాలంటే ఆవేదన కలుగుతోంది. దీంతో వైసీపీ నాయకులకు అప్పట్లో పరిచిన రెడ్ కార్పెట్‌ని తీసి పారేయడానికి చాలా మంది అధికారులు, సిబ్బందికి చేతులు రావడం లేదు. వైసీపీ పాలనలో ఆ పార్టీ చోటా మోటా నాయకులు సీఐ, డీఎస్పీలను శాసించే స్థాయిలో దర్పం వెలగబెడుతూ దందాలు సాగించి జనాల నుంచి దండిగా దండుకున్నారు. ఆ రాబడిని వదులుకోలేక ఇంకా అలాగే కొనసాగుతున్న వాళ్లకు పోలీసులు కొందరు అండగా నిలుస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బదిలీలు చేపట్టింది.వైసీపీ దాష్టీకాలకు కొమ్ముకాసిన వాళ్లను పక్కన పెట్టారు. కానీ పరిస్థితి చూస్తుంటే అలా అని అనుకున్నారే గానీ క్షేత్ర స్థాయిలో ఆ మార్పు కనిపించకపోవడం ప్రభుత్వంపై విమర్శలకు తావిస్తోంది. సీట్ల మార్పిడిలో డబ్బుకు ప్రాధాన్యం ఇవ్వడంతో 'ఫ్యాను గాలి'కి బాగా అలవాటు పడిన వాళ్లు కూడా కీలకమైన స్టేషన్లను సాధించుకున్నారు. ఒక రకంగా వైసీపీకి కొమ్ముకాయలేక లూప్‌లైనులో ఉన్న వాళ్లకు అన్యాయమే జరిగింది. ఏదో చెస్ బోర్డులో పావు లను కదిపినట్లు జిల్లాలో పని చేస్తున్న వాళ్లను బదిలీ పేరుతో ఆ పక్కకో ఈ పక్కకో జరిపారు అంతే. వైసీపీ నేతలకు పూర్తిగా తొత్తులని పేరుబడిన వాళ్లకు మంచి స్టేషన్లనే కట్టబెట్టారు. దీంతో కొత్త సీసాలో పాత సారా మాదిరిగానే పరిస్థితి ఉంది. వైసీపీ నాయకులు స్టేషనుకు రాగానే సాదరంగా కుర్చీ ఆఫర్ చేసి, టీ ఇచ్చి మరీ మాట్లాడి పంపిస్తున్నారు. గతంలో టీడీపీ నాయకులను హీనంగా చూసేవాళ్లు. జనసేన, బీజేపీ వాళ్లను అసలు పట్టించుకోవడం జరిగేది కాదు. బాధితుడివైపు నిలబడినా టీడీపీ నాయకులపై కేసులు బనాయించి వేధించేవాళ్లు. కానీ అక్రమాలతో అంటకాగడం అలవాటు పడిన వైసీపీ నేతలకు మాత్రం ఇప్పటికీ రాచమర్యాదలు జరుగుతున్నాయి. సీఐలు, ఎస్ఐల బదిలీలపై కూటమి పాలకులు పెద్దగా దృష్టి పెట్టకపోవడం, ఈ రెండు నెలలూ కుదురుకోవడానికి సమయం సరిపోవడంతో సందట్లో సడేమియాగా బదిలీలు జరిగాయనే అపవాదు నడుస్తోంది. వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఛీ కొట్టినా స్టేషన్లలో మాత్రం మర్యాదలకు లోటుండడం లేదు. దీంతో చాలా మంది వైసీపీ నాయకులు ఫోన్లతోనే పని కానిచ్చేస్తున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు..



6వ వార్డులో రాళ్లు పగిలిపోయి ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ

కొవ్వూరు, ఆగస్టు 23: కొవ్వూరు మెయిన్ రోడ్‌లో డ్రైనేజీపై కల్వర్టు రాళ్లు విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. స్థానిక 6వ వార్డులో బస్టాండ్ నుంచి వాటర్‌ట్యాంకుకు వెళ్లే మెయిన్ రోడ్ లో మారుతి షోరూం ఎదుట డ్రైనేజీ కల్వర్టుపై 2 రాళ్లు పగిలిపోయాయి. రాత్రి సమయంలో వాహనదారులు ఆదమరిచి వస్తే ప్రమాదాల బారిన పడక తప్పదు. కల్వర్టుపై రాళ్లు పగిలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయని మున్సిపల్ కమిషనర్‌కు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా 20 రోజులుగా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రజలు, పిల్లల భద్రతను దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీ కల్వర్టుపై విరిగిపోయిన రాళ్లను మరలా ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం

కొవ్వూరు, ఆగస్టు 24: కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి సహకారంతో న్యాయ సిబ్బందికి, న్యాయవాదులకు, న్యాయవాద గుమస్తాలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో బీపీ, డయాబెటిక్, టెస్టులు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఏబీఎన్ కాలేజీ పూర్వవిద్యార్థిని రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థి కుటుంబసభ్యులు

కొవ్వూరు, ఆగస్టు 24: సింగపూర్‌లో స్థిరపడిన కొవ్వూరు ఏబీఎన్ డిగ్రీ కళాశాలలో కళాశాల పూర్వవిద్యార్థిని సదరు కళాశాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. ఏబీఎన్ కళాశాలలో 2000-03 విద్యా సంవత్సరంలో బీఎస్సీ కంప్యూటర్ సైన్సు చదువుకున్న జమ్ముల భువనేశ్వరి సింగపూర్‌లో స్థిరపడింది. తాను చదువుకున్న కళాశాలలో చదువుకుంటున్న ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సహాయం చేయాలని సంకల్పంతో భువనేశ్వరి భర్త మద్దిపాటి శ్రీరామ్, తండ్రి జమ్ముల కాశీ విశ్వనాథ్‌లు శనివారం ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావుకు రూ. లక్ష చెక్కును అందజేశారు.

అభివృద్ధిని సరిగ్గా ప్రచారం చేసుకోలేదు

అందుకే వైసీపీ ఓటమి..మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

పెరవలి, ఆగస్టు 24: గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని సరిగ్గా ప్రచారం చేసుకోకపోవడం, ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోవడంతో తమ పార్టీ ఓటమి చెందిందని మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు పేర్కొన్నారు. తీపర్రులో ఒక కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన కుందుల భూపతిరావు ఇంటి వద్ద కొద్దిసేపు ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు. ప్రజలు కూడా మార్పు కోరుకున్నారని గతంలో వైసీపీని గెలిపించినట్లుగానే ఈ సారి కూటమి ప్రభుత్వం కావాలనుకున్నారన్నారు. గత ఎన్నికల ముందు కూటమి నాయకులు తలకు మించిన హామీలు ఇచ్చారని వాటిని ప్రస్తుతం అమలు చేస్తారా.. లేదా అనేది వేచి చూడాలన్నారు. అపుడే తాము విమర్శలు చేయబోమని ఏడాది గడిచిన అనంతరం ప్రజలకు కూడా విషయం అర్థమై హామీలు సక్రమంగా అమలు కాకపోతే ప్రజల్లోనే వ్యతిరేకత వస్తుందని, అపుడే తాము కూడా ప్రజలకు మరింత అర్థమయ్యే విధంగా చెబుతామని పేర్కొన్నారు.

లారీ ఢీకొని ఉపాధ్యాయురాలు మృతి



లారీ ఢీకొని మృతిచెందిన ఉపాధ్యాయురాలు, ఫైల్‌ఫొటో

కొవ్వూరు, ఆగస్టు 24: కొవ్వూరు మండలం దేచర్ల గ్రామంలో లారీ ఢీకొని ఉపాధ్యాయురాలు మృతి చెందింది. రాజమహేంద్రవరం కంబాలచెరువు ప్రాంతానికి చెందిన బడుగు రాజారత్నం(47) దేవరపల్లి మండలం గౌరీపట్నం హైస్కూల్లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్నారు. కుమార్తె నిషితకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో 5 రోజులు మెడికల్ లీవు పెట్టడానికి పాఠశాలకు రాజమహేంద్రవరం నుంచి బస్సులో వచ్చారు. పని ముగించుకుని ఇంటికి వెళ్లడానికి పాఠశాలలో పనిచేస్తున్న లెక్కల మాష్టారు కదిరి మురళీకృష్ణప్రసాద్‌ను గౌరీపట్నం సెంటరులో ప్యాసినో స్కూటర్‌పై డ్రాప్ చేయాలని కోరారు. గౌరీపట్నం సెంటర్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలుపుదల చేయకపోవడంతో పంగిడి సెంటర్‌లో డ్రాప్ చేయాలని కోరడంతో ఇద్దరూ ప్యాసినో స్కూటర్‌పై బయలుదేరారు. వర్షం కారణంగా రోడ్డు పక్కన మట్టి చేరడంతో దేచర్లలోని త్రివేణి ఫ్యాక్టరీ సమీపంలో బైక్ జారడంతో ఇద్దరు కిందపడిపోయారు. మురళీకృష్ణప్రసాద్ పైకిలేచి చూసేసరికి వెనుక వస్తున్న లారీ రాజారత్నం తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందింది. కొవ్వూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త వి.రాజేంద్ర ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.శ్రీహరి కేసునమోదు చేశారు.

ఏఐసీసీ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా రాజు



ఎంపిక ధ్రువపత్రాలు అందుకున్న ఏఐసీసీ నూతన కార్యవర్గ సభ్యులు

గోపాలపురం, ఆగస్టు 24: ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా రెవరెండ్ తానేటి రాజు ఎంపికయ్యారు. రాజమహేంద్రవరంలోని సీఎస్ఎన్ చర్చ్‌లో పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ ప్రతాప్ కొమ్మనాపల్లి, జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ కోడే మోజెస్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడిగా సీహెచ్.శామ్యూల్‌రాజు, మండలాధ్యక్షుడిగా పౌలన్న, పొలిటికల్ వింగ్ అధ్యక్షుడిగా రెవరెండ్ సాల్మన్‌రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా దుగ్గిరాల జ్యోతిలను ఎంపిక చేశారు. మండలంలో నలుగురికి పదవులు కేటాయించిన ఏఐసీసీ ప్రతినిధులకు శామ్యూల్‌రాజు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



చాగల్లు, ఆగస్టు 24: మండలంలో బ్రాహ్మణగూడెంలోని హైస్కూల్లో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్, నిడదవోలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. జిల్లా రైస్ మిల్లు అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి బాబూరావు మాట్లాడుతూ అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గారపాటి ప్రసాద్, ఎస్ఎంసీ అధ్యక్షుడు శ్యామ్‌బాబు, కోలా సతీష్, టీడీపీ నాయకులు గారపాటి మోహన్, గారపాటి కృష్ణ, దొమ్మేటి వేణు, దొమ్మేటి శ్రీను పాల్గొన్నారు.

అరటితోట ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు, ఆగస్టు 24: అరటితోట ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. దొమ్మేరు గ్రామానికి చెందిన కలగర వెంకట్రావు కొంతభూమిని కౌలుకు తీసుకుని అరటితోట వేశాడు. పక్కనే సాగుచేస్తున్న నీరుకొండ సత్యనారాయణ తన పొలంలో చెరకుతోట కర్రలు తీసివేసి చెత్తను తగలబెట్టాడు. మంటలు ఎగిసిపడి 100 అరటిమొక్కలు ధ్వంసమై రూ.50 వేలు నష్టం వాటిల్లిందని కలగర వెంకట్రావు పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రేపు పెరవలిలో సహస్ర గళార్చన

పెరవలి, ఆగస్టు 24: ఈ నెల 26న కృష్ణాష్టమి సందర్భంగా పెరవలి దీపికా కన్వెన్షన్ కల్యాణ మండపంలో సహస్ర గళార్చన ఏర్పాటు చేసినట్టు హిందూ ధర్మ పరిరక్షణ సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆ రోజు 27 పాఠశాలలకు చెందిన 1008 మంది చిన్నారులతో భక్తుల దాతల సహకారంతో సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా పిల్లలు 18 అధ్యాయాలు, 700శ్లోకాలు చదువుతారని, విద్యార్థులతో 27 మంది కృష్ణులుగా, 27 మంది రాధా వేషధారణలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 94413 47769 నెంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

- అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి
- దేవరపల్లి సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మద్దిపాటి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి, ఆగస్టు 24: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు హెచ్చరించారు. దేవరపల్లిలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన శనివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అధికారులు పారదర్శకతతో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. స్థానిక సమస్యల్లో ప్రజాప్రతినిధులు, అధికారులకు పరిష్కారం కాకపోతే, వాటిని తన దృష్టికి తీసుకొస్తే జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులతో సంప్రదించి పరిష్కరిస్తానన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని ఎమ్మెల్యే అన్నారు. ప్రత్యేక ప్రణాళిక రూపొందించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్నో ఏళ్లుగా లక్ష్మీపురం, పల్లంట్ల, కురుకూరు, త్యాజంపూడి రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటి నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కొవ్వూరు, గుండుగొలను జాతీయ రహదారిపై గడిచిన 16నెలల్లో 70మంది మృతి చెందినట్టు పోలీస్ రికార్డులు ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రమాద నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రమాదం జరిగిన వెంటనే చికిత్స కోసం రాజమహేంద్రవరం, విజయవాడ వెళ్లాల్సి వస్తుందని, హైవే పక్కన సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తానని మద్దిపాటి అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దేవరపల్లిలో ముంపుకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక డ్రైన్లు, వంతెనలు నిర్మాణం చేస్తామన్నారు. త్యాజంపూడి ఎంపీటీసీ వెంకటరత్నం మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుందని, దాని స్థానంలో కొత్త ట్యాంకు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామలక్ష్మి, ఎంపీడీవో ప్రభాకరరావు, ఎంపీటీసీ స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గణేష్ చౌక్‌లో చవితి ఉత్సవాలకు

రాట ముహూర్తం



గణేష్‌చౌక్‌లో చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు, ఆగస్టు 24: నిడదవోలులోని గణేష్ చౌక్ సెంటర్‌లో శ్రీ పూజ గణపతి, కుమారస్వామి ఆలయంలో 105వ గణపతి నవరాత్రుల ఉత్సవాలకు శనివారం ఉదయం వేద పండితుల ప్రత్యేక పూజలతో రాట ముహూర్తం నిర్వహించారు. ఆలయం వద్ద మామిడి తోరణాలు, పసుపు కుంకుమలతో అలంకరించిన రాటను ప్రతిష్ఠించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాలకు పురపాలక సంఘం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, సీఐ వి.శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, జనసేన పట్టణాధ్యక్షుడు రంగా రమేష్, కౌన్సిలర్ పువ్వుల రతీదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, ఎండీ ఫయాజ్, ఆలమూరు రాజా, ఎస్‌కె పాషా, మద్దుకూరి శ్రీనివాసరావు, సరిదే సత్యం, తోలేటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాల ఏర్పాట్లకు అనుమతి తప్పనిసరి

విగ్రహం ఎత్తు ఐదడుగులు మించరాదు : కొవ్వూరు సీఐ విశ్వం



కొవ్వూరు, ఆగస్టు 24: గణపతి నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు అనుమతి పోలీసులు తప్పనిసరిగా పొందాలని, మండపాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహణ కమిటీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఐ పి.విశ్వం శనివారం పేర్కొన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసే వాళ్లు పంచాయతీ అనుమతి పొందాలని, ఎత్తు 5 అడుగులకు మించరాదని, విగ్రహాల వల్ల ప్రజలకు, ట్రాఫిక్‌కు ఎటువంటి ఆటంకాలు కలగరాదన్నారు. విగ్రహం ఎత్తు, బరువు, ఉత్సవాలు ఎన్నిరోజులు నిర్వహించేది, నిమజ్జనం చేసే ప్రదేశం, సమయం, రూట్ మ్యాప్‌ను పోలీసులకు ముందుగా అందజేయాలన్నారు. మండపాల వద్ద ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా సౌండ్ పెట్టరాదని, డీజే బాక్స్‌లకు అనుమతి లేదన్నారు. ఉదయం 6నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాన్నారు. అశ్లీల నృత్యాలు, బాణసంచా కాల్చడం నిషేధమన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా నిర్దేశిత ప్రాంతంలో విగ్రహ నిమజ్జనం చేసుకోవాలన్నారు. ఊరేగింపులో కార్యక్రమ వివరాలు, వాహనాలు, డ్రైవర్ల రికార్డులు, ఆధార్ జిరాక్స్‌లు ముందుగానే పోలీసులకు తెలియజేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

అనవసర యాప్‌ల లింక్‌లు ఓపెన్ చేయొద్దు

- సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలి
- అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణ

తాళ్లపూడి, ఆగస్టు 24: సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ టి.రామకృష్ణ అన్నారు. స్థానిక కరిబండి విద్యా సంస్థల్లోని ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు శనివారం సైబర్ నేరాలు, మొబైల్ యాప్‌ల వాడకం వల్ల కలిగే నష్టాలు, ఇబ్బందులపై జరిగిన అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని, సైబర్ నేరగాళ్లు లింక్స్ పంపి వాటి ద్వారా నేరాలకు పాల్పడుతున్నారన్నారు. అనవసరమైన మొబైల్ యాప్‌ల లింక్‌లను ఓపెన్ చేసి ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి ఉన్నతంగా జీవించాలని ఎస్ఐ చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.మాధవరావు, ఉపాధ్యా యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టోల్‌ఫ్రీ 1930కు ఫోన్ చేసి సహకారం పొందొచ్చు: ఏఎస్ఐ

దేవరపల్లి, ఆగస్టు 24: స్థానిక భాష్యం స్కూల్‌లో సైబర్ నేరాలపై జరిగిన అవగాహన సదస్సులో ఏఎస్ఐ ఆదినారాయణ మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడితే టోల్‌ఫ్రీ 1930 నెంబర్‌కు ఫోన్ చేసి సహకారం పొందవచ్చన్నారు. అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియాలో ఫొటోలు పంచుకోవడం అతిప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పేరయ్యనాయుడు, చాంప్స్ ప్రిన్సిపాల్ షేక్ సభాన, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడిపూడిలో టీడీపీ విజయోత్సవ సభ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, ఆగస్టు 24: తాడిపూడి గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తాడిపూడిలో శనివారం జరిగిన టీడీపీ విజయోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని తాడిపూడిలోని ఒకటో బూత్ నుంచే తనకు మెజారిటీ ప్రారంభమైందని ఈ మేలు మరువనన్నారు. కొవ్వాడ కాజ్‌వే నిర్మాణం, రైతుల సాగునీరు, పుంతరోడ్ల నిర్మాణం వంటి సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నామా కొండబాబు, నామా శ్రీరాములు, నామా సత్యనారాయణ, కంఠమణి రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, గంటా కృష్ణ, కాకర్ల సత్యేంద్ర, చెవ్వూరు బంగార్రాజు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



దేవరపల్లి, ఆగస్టు 24: దేవరపల్లిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా శనివారం నిర్వహించారు. స్థానిక భాష్యం, చైతన్య స్కూళ్లలో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలు వేసి ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకృష్ణుడి జీవిత విశేషాలను నృత్యరూపకంలో వివరించారు. కార్యక్రమంలో భాష్యం ప్రిన్సిపాల్ పేరయ్యనాయుడు, చాంప్స్ ప్రిన్సిపాల్ షేక్ సభాన, శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ కిషోర్, ఏజీఎం పార్థసారధి పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు



రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 24: స్థానిక ఇస్కాన్ మందిరంలో జరుగుతున్న శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు శనివారం ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా విశ్వశాంతి మహా యజ్ఞం, శ్రీకృష్ణ లీలా కథామృత ప్రవచనం, రాధాకృష్ణుల వాహన సేవ, బాలలతో కూచిపూడి నృత్యాలు, స్వామి పవళింపు సేవ జరిగాయి. భక్తుల దర్శనానికి ఇబ్బందులు లేకుండా మందిర కమిటీ చైర్మన్ శివానంద నిమాయిదాస్, సభ్యులు శ్యామంగ శ్రీనివాస్, రవీంద్ర చక్రదాస్, హేమా నిమాయిదాస్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

గోదావరి స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు ఇవ్వాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24: రాజమహేంద్రవరంలోని గోదావరి రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు ఇవ్వాలని పలువురు నాయకులు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని కోరారు. ఈమేరకు శనివారం గోదావరి రైల్వేస్టేషన్ అడ్వైజరీ కమిటీ నాయకులు ఎం.కృష్ణమాచార్యులు, తంగెళ్ల శ్రీనివాసరావు, పైబోయిన సురేంద్రకుమార్, కారుమూరి సురేష్, కళ్లకూరి శ్రీనివాసరావు తదితరులు ఎంపీకి ఒక వినతిపత్రం అందజేశారు. కరోనా తర్వాత గోదావరి స్టేషన్‌లో రైళ్లకు పూర్తిగా హాల్టు నిలిపివేయడంతో స్టేషన్ అభివృద్ధికి నోచుకోవడంలేదన్నారు. చిన్న వ్యాపారులు, ఆటోవాలాలు, రైల్వే కూలీలు తదితర అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వచ్చే ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ గోదావరి స్టేషన్ మీదుగానే వెళతాయని, వీటికి గోదావరి స్టేషన్‌లో హాల్టు ఇస్తే మళ్లీ పూర్వ వైభవం వస్తుందని వివరించారు. అలాగే గోదావరి స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ పోలీస్ స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేయాలని వారు కోరారు.

నిడదవోలులో విరిగిన రైల్వేగేటు

నెహ్రూ హోమ్ సెంటర్‌లో భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్



రైల్వే గేటు విరిగిపోవడంతో నిలిచిపోయిన ట్రాఫిక్

నిడదవోలు, ఆగస్టు 24: నిడదవోలులోని నెహ్రూ హోమ్ సెంటర్‌లో ఉన్న రైల్వేగేటు శనివారం సాయంత్రం విరిగిపోయింది. దీంతో భారీ ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. నెహ్రూ హోమ్ సెంటర్‌లో జరుగుతున్న ఆర్‌వోబీ పనులతో ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాంటి సమయంలో రైల్వేగేటు విరిగిపోవడంతో సుమారు గంటపాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. రైల్వే అధికారులు స్లైడర్ బుమ్ గేటు ద్వారా వాహన రాకపోకలను నియంత్రించి రైళ్ల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. సుమారు గంట తరువాత రైల్వే గేటుకు అధికారులు మరమ్మతులు నిర్వహించారు.

బీటలు వారిన రోడ్డు

ఉండ్రాజవరం-తణుకు రహదారిలో వాహనదారుల ఇక్కట్లు



ఉండ్రాజవరం, ఆగస్టు 24: ఉండ్రాజవరం-తణుకు ఆర్‌అండ్‌బీ సిమెంట్ రోడ్డు కొన్నేళ్లుగా పలు చోట్ల బీటలు తీయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బీటలు వారిన ప్రదేశం నుంచి వెళ్లేటపుడు వాహనాలు గాడిలో పడి ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. అప్పడప్పుడు ఆర్‌అండ్‌బీ అధికారులు తారు వేసినా దాని వల్ల ఉపయోగం ఉండడంలేదు. నిత్యం క్వారీ లారీలు వెళుతున్న ఈ రోడ్డులో సిమెంట్ రోడ్డుపై ఉన్న గోతులు, విడిపోయిన జాయింట్లు పూర్తిస్థాయిలో మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఉండ్రాజవరం, మోర్త, దమ్మెన్ను గ్రామాల వరకు ఉన్న రోడ్డులో గోతులు నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు మరింత పెద్దవి మారి ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డులో గోతులు పూడ్చాలని కోరుతున్నారు.

వచ్చే నెల 8 నుంచి

నేషనల్ మెగా బ్యాడ్మింటన్ ఈవెంట్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24 : రాజమహేంద్రవరంలో సెప్టెంబరు 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ నేషనల్ మెగా బ్యాడ్మింటన్-2024 ఈవెంట్ జరుగుతుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక నారాయణపురంలోని ఆర్ఎంసీ ఇండోర్ షటిల్ కోర్టులో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్యాడ్మింటన్ ఈవెంట్‌కు సుమారు 150 మంది వరకూ జాతీయ క్రీడాకారులు వస్తున్నారని, టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు, రాష్ట్ర మంత్రులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈవెంట్ సక్సెస్ చేయడానికి ఆర్గనైజింగ్ కమిటీని కూడా వేశామని, అందరూ బాధ్యతగా భావించి విజయవంతం చేయాలని కోరారు. 2027లో ఏపీలో నేషనల్ గేమ్స్ నిర్వహించడానికి కసరత్తు చేస్తున్నామన్నారు. రాజమహేంద్రవరాన్ని స్పోర్ట్సు హబ్‌గా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ అంకం చౌదరి, ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలకు న్యాక్ బి గ్రేడు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24: రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బీ గ్రేడు లభించింది. ఈనెల 13, 14 తేదీల్లో న్యాక్ కమిటీ కళాశాలను సందర్శించి సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు పరిశీలించిన తర్వాత బి గ్రేడును ప్రకటించినట్టు ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు తెలిపారు. ఆయా విభాగాధిపతుల సమష్టి కృషి ఫలితంగానే కళాశాలకు అత్యుత్తమ ర్యాంకు లభించిందని, కొన్ని నెలల ముందునుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో అనుకున్న లక్ష్యాన్ని అధిగమించామని ఆయన పేర్కొన్నారు. అధ్యాపక బృందాన్ని, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.

విత్తనాలు, పురుగుల మందులు చట్టాలపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 24: జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక హాలులో వ్యవసాయశాఖ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు చట్టాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. శనివారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. రైతులకు అవసరమైన ఉత్పాదకాల పంపిణీ, అమ్మకంలో నాణ్యతలో రాజీపడకుండా చట్టం అమలు చేయాలన్నారు. చట్టం విధివిధానాలు, తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్, ఏడీఏ కర్నూల్ శ్రీవెంకటేశ్వర్లు, కమిషనర్ కార్యాలయం ఏడీఏ రాజశేఖర్, అమలాపురం, జిల్లాలోని ఏడీఏలు,ఎంఏవోలు పాల్గొన్నారు.

యువతలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనకు

29న యూత్ ఫెస్టివల్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై యువతలో అవగాహన కల్పించడానికి ఈనెల 29న యూత్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర శనివారం ఓ ప్రకటన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు, మార్గదర్శకాలతో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈ ఫెస్టివల్ జరుగుతుందని వెల్లడించారు. ఇందులో భాగంగా 29న డిగ్రీ చదువుతున్న విద్యార్థులు, ట్రాన్స్‌జెండర్లతో 5కే రన్ నిర్వహిస్తున్నామని, ఉదయం 6.30 గంటలకు రాజమహేంద్రవరం వై.జంక్షన్ నుంచి గోదావరి తీరాన ఉన్న ఇస్కాన్ టెంపుల్ వరకు ఐదు కిలోమీటర్ల మారథాన్ ఉంటుందని తెలిపారు. అలాగే ప్రభుత్వ స్కూళ్లలో 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 29వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ శాఖాధికారి కార్యాలయంలో జిల్లాస్థాయి క్విజ్ నిర్వహిస్తారన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారని వసుంధర చెప్పారు.

కార్పొరేషన్ ఖాళీ స్థలాల్లో పార్కులు

కమిషనర్ కేతన్ గార్గ్.. నగరంలో పలు ప్రాంతాలు పరిశీలన



ఖాళీస్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 24: రాజమహేంద్రవరంలో కార్పొరేషన్‌కు చెందిన ఖాళీ స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేస్తామని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. శనివారం నగరంలో కార్పొరేషన్ ఖాళీ స్థలాలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాద వాతావరణాన్ని కల్పించడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. నగరంలో పార్కులను అభివృద్ధి చేయడంలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం తీసుకుంటామన్నారు. అలాగే నిర్వహణ బాధ్యతలు వారికి అప్పగిస్తామన్నారు. అందుకు అనుగుణంగా తగిన ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు. గతంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణ వ్యర్థాలు తరలింపు జరిగేదని, అందుకు రుసుము కూడా నిర్ణయించారని, అయితే కొద్ది కాలం నుంచి ఆ ప్రక్రియ జరగడంలేదన్నారు. తిరిగి వ్యర్థాల తొలగింపు కార్యక్రమం చేపడతామన్నారు. నగరంలోని నిర్మాణ వ్యర్థాలను విడదీయడానికి వీరభద్రనగర్‌లో ఉన్న కార్పొరేషన్‌కు చెందిన స్లాటర్ హౌస్‌లో ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. అందుకు తగిన ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ జి.పాండురంగారావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈ మదర్షాఆలీ, డిప్యూటీ సిటీ ప్లానర్ బాలాజీ, ఏఈ, శానిటరీ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణల బాధితులంతా

28న విజయవాడ తరలిరండి : సీపీఐ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 24: వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలు, భూ దందాల బాధితులంతా ఈనెల 28న విజయవాడ సీపీఐ కార్యాలయానికి రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో భూ బాధితుల రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల ధరలు బాగా పెరిగినందున అనేక ప్రాంతాల్లో భూములు అన్యాక్రాంతమవుతున్నాయన్నారు. దొంగ పట్టాలు పుట్టించి వందల ఎకరాల భూమిని కాజేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	మిస్టర్ బచ్చన్
వై.స్క్రీన్ 2	తంగలన్
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్

నిడదవోలు

వీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
రాధాకృష్ణ	ఆయ్, తంగలన్
శ్రీగణపతి	డబుల్ ఇస్మార్ట్

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్